


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 13-03-2019 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 42 సంచిక : 158 పేజీలు : 8 వెల : 1 రూపాయి

## ఎన్నికల వేడి

# రాజుకుంది

**టికెట్ల కేటాయింపుల్లో పార్టీల కసరత్తు**

**మొత్తం జాబితా విడుదలకు వైకాపా వ్యూహరచన**

**తొలిజాబితా విడుదలకు తెదేపా సన్నాహాలు**

**జనసేనాని పోటీ ఎక్కడి నుంచో?**







అమరావతి: ఏపీలో ఎన్నికల వేడి రాజుకుంది. పోలింగ్‌కు ఇంకా నెల రోజుల గడువు సైతం లేకపోవడంతో నియోజకవర్గాల్లో అభ్యర్థులకు టికెట్ల కేటాయింపు అంశంపై కసరత్తులో రాజకీయ పార్టీలు తలమునకలయ్యాయి. తెదేపా 130 మంది అభ్యర్థులతో తొలి జాబితా విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తోంది. రేపో, ఎల్లుండో ఆ జాబితా విడుదల చేయనుంది. మరోవైపు, మొత్తం జాబితాను ఒకేసారి విడుదల చేసేందుకు వైకాపా వ్యూహరచన చేస్తున్నట్టు తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో ప్రత్యామ్నాయం తామేనంటూ తొలిసారిగా ఎన్నికల బరిలో దిగుతున్న జనసేన ఇప్పటికే ఇద్దరు లోక్‌సభ అభ్యర్థుల జాబితాను వెల్లడించగా.. త్వరలోనే అసెంబ్లీ అభ్యర్థుల తొలి జాబితాను కూడా విడుదల చేయనుంది. వామపక్షాలతో పొత్తు పెట్టుకుని ఎన్నికల్లో పోటీ చేస్తామని ఇప్పటికే జనసేనాని ప్రకటించిన విషయం తెలిసిందే.

ఈ నేపథ్యంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పోటీపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. తొలుత అనంతపురం జిల్లా నుంచి పోటీ చేస్తానని పవన్ ప్రకటించినా.. ఏ నియోజకవర్గం నుంచి అనే విషయంపై ఆయన స్పష్టత ఇవ్వలేదు. ఏడాది క్రితం ఆయన ఉత్తరాంధ్రలోని ఏదో ఒక జిల్లా నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరిగింది. ఆ తర్వాత పవన్ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటించినా పోటీపై ఎక్కడా స్పష్టత ఇవ్వలేదు. గత ఏడాది ప్రజాపోరాట యాత్రలో భాగంగా తూర్పు గోదావరి జిల్లా పిఠాపురంలో జరిగిన బహిరంగ సభలో పవన్ మాట్లాడుతూ ఇక్కడి నుంచే పోటీ చేస్తానేమో అంటూ వ్యాఖ్యానించారు. కానీ ఆ తర్వాత పవన్ పోటీకి సంబంధించిన ఎలాంటి విషయమూ బయటకు రాలేదు. తాజాగా ఎన్నికల షెడ్యూల్ రావడంతో పవన్ పోటీ చేసే స్థానంపై ఊహాగానాలు జోరందుకున్నాయి. విశాఖ జిల్లా గాజువాక పేరు కూడా తెరపైకి వచ్చింది. పిఠాపురం లేదా విశాఖ జిల్లా గాజువాక నుంచి ఆయన ఎన్నికల బరిలో నిలిచే అవకాశముందని జోరుగా ప్రచారం జరుగుతోంది. పవన్ ఎక్కడి నుంచి పోటీచేస్తారనే ఉత్కంఠకు మరికొద్ది రోజుల్లోనే తెరపడనుంది.

**పెండింగ్ జాబితాపై తెదేపా కసరత్తు ముమ్మరం?**

పెండింగ్‌లో ఉన్న అభ్యర్థుల జాబితాను ఖరారు చేసేందుకు తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు కసరత్తు ముమ్మరం చేశారు. సుమారు 130 నియోజకవర్గాల్లో ఇప్పటికే అభ్యర్థులను ఖరారు చేసిన ఆయన.. పెండింగ్‌లో ఉన్న దాదాపు 40 నుంచి 45 నియోజకవర్గాల్లో అభ్యర్థుల ఎంపికను పూర్తి చేయాలని యోచిస్తున్నారు. పెండింగ్‌లో ఉంచిన నియోజకవర్గాల తరువాయి 2లో..

# హవాలా రాకెట్టు గుట్టురట్టు

- భారీగా సొమ్ము స్వాధీనం
- నిందితులు, నాలుగు వాహనాల పట్టివేత
- నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్



హైదరాబాద్ : నగర కమిషనరేట్ పరిధిలో మరో హవాలా రాకెట్ గుట్టురట్టయింది. ఈస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఈ రాకెట్‌ను ఛేదించి..నలుగురు వ్యాపారుల నుంచి రూ.90.50 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల కోడ్ దృష్ట్యా కాచీగూడ, సుల్తానాబాద్ పోలీసు స్టేషన్ల పరిధిలో వాహనాల తనిఖీలు పోలీసులు చేపట్టారు. వేర్వేరుగా వాహనాల్లో నగదు తరలిస్తున్న వ్యాపారులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

దేవేష్ కొటారి అనే వ్యక్తి వద్ద రూ.50 లక్షలు స్వాధీనం చేసుకోగా.. భక్తిప్రజాపతి వద్ద రూ.23 తరువాయి 2లో..

# అందరూ సమన్వయంతో పనిచేయాలి

## రాజకీయ పార్టీలకు కలెక్టర్ విజ్ఞప్తి



విశాఖపట్నం: సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపద్యంలో అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకొనేందుకు సహకరించాల్సిందిగా జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలక్టర్ కె.భాస్కర్ విజ్ఞప్తి చేసారు. మంగళవారం ఉదయం కలక్టర్ చాంబర్ లో వివిధ రాజకీయపార్టీల ప్రతినిధులతో సమావేశాన్ని ఏర్పాటుచేసారు. ఈ సందర్భంగా కలక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రచారానికి సంబందించి హోర్డింగులు, కరపత్రాలు, బహిరంగ సభల నిర్వహణలకు సంబందించి ముందుగా ఎన్నికల అధికారి అనుమతి పొందాలన్నారు. తమ పార్టీలకు సంబందించి ఏజెంట్లను నియమించుకోవాలన్నారు. ఎటువంటి నగదు, లిక్కర్, వస్తువుల ప్రలోభాలకు గురి చేయరాదన్నారు. ప్రతి ఒక్క పార్టీ తమ ఖర్చులను పారదర్శకంగా చూపించాలన్నారు. వారు చేసే ఎన్నికల ఖర్చు పై ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. పార్లమెంటు ఎన్నికలకు సంబందించి అభ్యర్ధి ఖర్చు 70 లక్షలను, శాసనసభ ఎన్నికల అభ్యర్ధి ఖర్చు28 లక్షలు దాటరాదన్నారు. అభ్యర్థులు నామినేషన్ నాటికి బ్యాంకులో కొత్త అకౌంటును ప్రారంభించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలన్నారు. పెయిడ్ వార్తలు, ఎడ్వర్ టైజ్ మెంటులను తరువాయి 2లో..

# డేటా ట్రాన్స్‌ఫర్ చేయడం తప్పే

- టీడీపీ స్పందించిన తీరు సరైనది కాదు
- మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్



తూర్పుగోదావరి : డేటా చోరీ కేసుపై మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్ మీడియా సమావేశంలో మంగళవారం మాట్లాడారు. ప్రభుత్వం వద్ద ఉండాల్సిన సమాచారం ప్రైవేటు సంస్థలకు ఎలా లభ్యమైందని ప్రశ్నించారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం అఫిషియల్‌గా ఐటీగ్రిడ్స్ వంటి సంస్థలకు డేటా ట్రాన్స్‌ఫర్ చేసినా అది తప్పేనని అన్నారు. అయినా, పోలీసుల ముందుకు రాకుండా అశోక్ ఎందుకు పరారీలో ఉన్నాడని విస్మయం వ్యక్తం చేశారు. ఐదేళ్ల టీడీపీ ప్రభుత్వానికి సంబంధించి ఎన్నో అవకతవకలను బయటపెట్టామని తెలిపారు. రాష్ట్ర రాజకీయాలకు సంబంధించి ఇదే ఆఖరు ప్రెస్ మీట్ అని వెల్లడించారు. ఏప్రిల్ 11న ఏపీలో పోలింగ్ పూర్తయ్యే వరకు ఇక మీడియా ముందుకురానని చెప్పారు.

డేటా చోరీపై ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేసిన ఆరోపణలపై స్పందించే విధానం ఇదేనా అని టీడీపీని ప్రశ్నించారు. ఎన్నికల స్థాయిని దిగజార్చారని మండిపడ్డారు. టీడీపీ సాధించిన విజయాలను ప్రజలకు వివరించాలి గాని అనవసర కామెంట్లు చేయడం తగదన్నారు. ఏపీ ప్రజలకు సంబంధించిన పూర్తి డేటా వివరాలు టీడీపీ సేవామిత్రలో ఉన్నాయని అన్నారు. సాధికార మిత్ర పేరుతో సర్వేలు చేసి ఆధార్ నెంబర్ సేకరించి.. ఓటర్ గుర్తింపు కార్డులతో జతచేయడం అక్రమమన్నారు. గడిచిన 40 ఏళ్లలో దేశంలో నిరుద్యోగిత తరువాయి 2లో..

## రంగా ఆశయ సాధన కొరకు

# తెదేపాకు తోడుగా ఉంటా

## మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా



అమరావతి: మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధా తెదేపాలో చేరేందుకు రంగం సిద్ధమైంది. బుధవారం సాయంత్రం ఆయన తెదేపాలో చేరనున్నారు. సోమవారం రాత్రి మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్‌తో కలిసి తెదేపా అధినేత చంద్రబాబుతో భేటీ అయిన రాధా.. మంగళవారం మధ్యాహ్నం మరోసారి సీఎంతో సమావేశమయ్యారు. వైకాపాను వీడిన ఆయన తెదేపాలో చేరతారంటూ గత కొంతకాలంగా ప్రచారం జరుగుతూ వస్తోంది. ఈ ఊహాగానాలకు చెక్ పెడుతూ ఆయన బుధవారం తెదేపాలో చేరనున్నారు.

ఈ సందర్భంగా రాధా మాట్లాడుతూ.. పేదలకు శాశ్వత ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నందుకు ధన్యవాదాలు చెప్పారు. తన తండ్రి వంగవీటి రంగా ఆకాంక్షను సీఎం నెరవేర్చారని, అందుకే తెదేపాకు తోడుగా ఉండాలని తాను నిర్ణయించుకున్నట్టు వెల్లడించారు. నియంతృత్వ స్వభావం ఉన్న వ్యక్తి చేతుల్లోకి అధికారం వెళ్లకూడదన్నారు. పేదల కోసం నిందలు మోసేందుకైనా తాను సిద్ధమన్నారు.

# వైఎస్సార్‌సీపీలోకి పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే బాబ్జీ



హైదరాబాద్: ఎన్నికల తరుణంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి పెద్ద ఎత్తున నాయకులు తరలివస్తున్నారు. పార్టీలోకి జోరుగా చేరికలు కొనసాగుతున్నాయి. తాజాగా పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జీ) మంగళవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. తరువాయి 2లో..




# పాల్ రావాలి.. పాలన మారాలి

దిల్లీ: కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సునీల్ అరోడాతో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ సమావేశమయ్యారు. ఏపీలో ఫారం-7 వినియోగించి అక్రమంగా ఓట్లు తొలగించేందుకు ప్రతిపక్ష నేత జగన్ ప్రయత్నిస్తున్నారని.. దీనిపై విచారణ జరిపి ఆయనపై చర్యలు తీసుకోవాలని సీఈసీని పాల్ కోరారు. సీఈసీతో సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో పోలింగ్ తేదీలను మార్చాలని.. నాలుగు లేదా ఐదో విడతలో ఎన్నికలు జరపాలని కోరినా తన విజ్ఞప్తిని ఈసీ తిరస్కరించిందని చెప్పారు. ఏపీలో తమకు 50శాతం ఓటు తరువాయి 2లో..



# ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చెయ్యాలి

**- వివి ప్యాడ్‌లపై ఓటర్లకు అవగాహన కల్పించాలి - జిల్లా కలెక్టర్ డా.ఎం.హరిజవహర్‌లాల్**



విజయనగరం : ఎన్నికల నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డా.ఎం.హరి జవహర్‌లాల్ రిటర్నింగ్ అధికారులను, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ నుండి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లోల ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు తేదీలు ఖరారు అయ్యాయని, ఈనెల 18వ తేదీన ఎన్నికల నిర్వహణ నోటిఫికేషన్ జారీ చెయ్యాలని అందుకు సంబంధించిన ఫారం-1 నోటిఫికేషన్‌ను జనరేట్ చేసి సిద్ధంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. ఈనెల 25వ తేదీన నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీయని, 26న స్క్రూటినీ చెయయడం, 28న నామినేషన్ల విత్‌డ్రాకు చివరి తేదీయని, ఏప్రిల్ 11వ తేదీ పోలింగ్ జరుగుతుందని, మే 23న ఓట్లలెక్కింపు ఉంటుందని ఆయన తెలిపారు. కౌంటింగ్ హాల్‌లను తనిఖీ చేసి సాయంత్రంలోగా నివేదిక అందజేయాలని సూచించారు. ఫారం7 దరఖాస్తులు స్వీకరించవద్దని ఎన్నికల కమిషన్ సూచించడమైందని ఆయన తెలిపారు. ఫారం6, ఫారం8, 8ఎలు ఈనెల 15వ తేదీ వరకు తీసుకోవాలని, వాటిని పరిశీలన చేసి పరిష్కరించాలన్నారు. ఏరోజు వచ్చిన దరఖాస్తులను ఆరోజే పరిష్కరించాలని ఆయన సూచించారు. ఎన్నికల నియమ, నిబంధనలకు సంబంధించి అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు, నామినేషన్ల పూర్తయిన తర్వాత అభ్యర్థులకు వివరించాలని ఆయన సూచించారు. ఏ కొత్త విషయం వచ్చినా రాజకీయ పార్టీల పత్రినిధులతో పాటుపత్రికా ప్రతినిధులకు కూడా తెలియజెయ్యాలని ఆయన సూచించారు. వివి ప్యాట్‌ల వినియోగంపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు.

ప్రస్తుత వేసవి కాలంలో సమ్మర్ ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని గ్రామాల్లో మంచినీటి సమస్య రాకుండా చూడాలని ఆయన సూచించారు. పశువులకు నీరు, పశుగ్రాసం ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చెయ్యాలన్నారు. ఉపాధి హామీ పథకం పనులు చేస్తున్న కూలీలకుల ఇతర సదుపాయాలు కల్పించాలని, ఏజెన్సీ ప్రాంతంలోమంచినీరు, ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఐటిడిఏ ప్రాజెక్టుఅధికారికి సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో సంయుక్త కలెక్టర్2 జె.సీతారామారావు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పైడిమాంబ పండుగ గోడపత్రిక ఆవిష్కరణ



పరవాడ : మండల కేంద్రమైన పరవాడగ్రామ ప్రజల ఆరాధ్యదేవతశ్రీపైడిమాంబఅమ్మవారి పండుగ గోడపత్రికను మంగళవారము ఉత్సవ కమిటీ సభ్యులు పరవాడమాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు,ఎంపిటీసి సభ్యులు పైల శ్రీనువాసురావు, సిరపురపు అప్పల నాయుడు, టిడిపినాయకులు పైల రామచంద్రరావు గ్రామపెద్దలు పైలపోతి నాయుడు (పెద్దింటి) చేతులుమీదగా మగళవారము గ్రామ పంచాయితీ కార్యలయంలో అవిష్క రించారు. ఈసందర్భంగా ఉత్సవ కమిటీ ప్రతినిదులు మాట్లడుతూ ప్రతిఏడాదిలాగే ఈఏడాది కూడి ఈపైడిమాంబ ఉత్సవాన్ని అంగరంఘవైభవంగా నిర్వహిస్తామనీతెలిపారు.

ఈజాతరను ఈనెల17,18,18తేదిల్లోఘనంగా నిర్వహించేందుకుఅన్నిఏర్పాట్లుపూర్తిచేసామనీ తెలిపారు.

ఈకార్యక్రమంలో బండారు రామారావు, బండారుసత్యనారాయణ, చుక్క సన్యాశిరావు, రెడ్డిసింహాచలం,గండినవెూబాబు,గండి ఈశ్వరావు, పైలటివి అప్పారావు, పైలమహలక్ష్మి నాయుడు తదితరులు పాల్గొన్నారు.




**మా వరిష్ట పౌరుల సమైక్య వేదిక సర్వసభ్య సమావేశం మంగళవారం చినవాల్తేరు, రాణీచంద్రమణి దేవి ఆసుపత్రి ప్రాంగణంలో, కొత్తగా మా కొరకు ఆవిష్కరింపబడిన హాలులో జరిగింది. ఈ సందర్భంగాహేతు ప్రసాద్ దంపతులకు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రెసిడెంట్ డా.టివిఎస్.రావు, వైస్ ప్రెసిడెంట్ డి.డి.ప్రసాదరావు, ఎం.శ్రీమన్నారాయణ, మాజీ బీజేపీ కార్పొరేటర్ కె.రత్నకుమారి, యు.వీరేశ్వరరావు, కె.మంగపతి, సిహెచ్.వెంకటరావు, సి.జి.రామారావు, కె.బాలకృష్ణారావు, ఎస్.ఉమారావు, బి.సూర్యనారాయణ, టి.ఎస్.ప్రసాద్ (హేతు), ఎస్.రామ కృష్ణారావు పాల్గొని వరిష్ఠ పౌరుల సమస్యల గురించి చర్చించారు.**

## అవంతిని విమర్శించే స్థాయి
# టీడీపీ నాయకులకు లేదు

భీమునిపట్నం : స్థానిక వైసిపి కార్యాలయం లో పత్రిక సమావేశం జరిగింది ఈ సమావేశం లో జిల్లా అదికార ప్రతినిధి ఎస్.కరుణాకర్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి లో ఉన్న నాయుకులకు అవంతి శ్రీనివాసరావు ను విమర్శించే స్థాయి లేదని అన్నారు.గంటా పై అనేక ఆరోపణలు సిట్ దర్యాప్తులు జరిగాయని ఏ మచ్చలేని నాయుకుడు అవంతి శ్రీనివాసరావు అని అన్నారు. జ్యూట్ మిల్ గొడౌన్స్ ను దగ్గర వుండి యజమానిని బెది రించి తక్కువ రేటు లో కొనలేదా అని ప్రశ్నించారు.అదే అవంతీ శ్రీనివాసరావు మీద ఒక మచ్చ కూడా లేదని ఆయన అన్నారు.ఇప్పుడు తెలుగుదేశం పార్టీ లో ఐదు పేరులు వినిపిస్తున్నాయని అవంతీ మీద పోటీ చేయడానికి ముందు ఒక మంచి నాయుకుడిని వెతిక్కోమని తెలిపారు.గంటాను ప్రజారాజ్యం పార్టీ లోకి తీసుకొని వచ్చి నాగబాబు తో చెప్పి టికెట్ ఇప్పించింది అవంతి శ్రీనివాసరావు అని అన్నారు .ఇకనైనా నిజాలు తెలుసుకొని ఆరోపణలు చెయ్యాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమం లో సి.హెచ్.బాస్కర్ రెడ్డి,జే ప్రసాద్,అల్లిపిల్లి నరసింగరావు, కదిరి.ఎల్లాజీ జీరు వెంకటరెడ్డి, జీ.వి.రమణ, వాసుపల్లి కొండబాబు, కాసరపు.ఎల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

## వివిధ శాఖల అధికారులతో ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి అత్యవసర సమావేశం

భీమునిపట్నం స్థానిక తాసిల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి కె,బాలా త్రిపుర సుందరి ఎన్నికల మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ అమలులో కి వచ్చి నందున అత్యవసర సమావేశం నిర్వహించారు ఇందులో భీమిలి నియోజకవర్గం లో వున్న వివిధ శాఖల అధికారులనుద్దేశించి మాట్లాడుతూ ఎన్నికల్లో విధి విధానాలను, అందరూ సక్రమంగా నిర్వర్తించి ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని, దీనితో పాటు విగ్రహాలకు ముసుగులు వేయడం, కట్ అవుట్ లు హోడింగ్ లు ఇంటి మీద వున్న జెండాలు తీయించడం, దేని కోసమైనా ఆర్ ఓ వద్ద పర్మిషన్ తీసు కోవాలని తెలిపారు. అలాగే నియోజకవర్గం లో వున్న సమస్యాత్మక ప్రాంతాలను పర్యటించి గుర్తించిన సమస్యాత్మక వ్యక్తులకు కౌన్సిలింగ్ చేసి ఎలక్షన్ నియమావలి ఈ విదంగా వున్నాది. దీనికి గనకా ఏవిద మైన ఆటంక పరిచినా కటినమైన చర్యలు తీసుకుంటామని తెలిపామని చెప్పారు. అలాగే ఎన్నికలను ప్రశాంతంగా జరిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో భీమిలి తహసీల్దార్ టి. కల్యాణ చక్రవర్తి, ఎ.సి.పి.,ప్రసన్నకుమార్, నియోజకవర్గ పరిదిలో వున్న సి.ఐ లు, ఎస్.ఐ,లు మరియు వివిద శాఖలు ఉన్న తాధికారులు పాల్గొన్నారు.

## బాలికల అభ్యున్నత కోసం ఎన్టీపిసి చేయూత



పరవాడ: పరవాడమండలపరిదిలో గల నేషనల్ దర్మల్ పవర్ కార్పోరేషన్ వారు బాలికలఅభ్యున్నతకోసముముందుకు వచ్చింది. స్దానికప్రభుత్వపాఠశాలలో ఐదువతరగతిపాస్ అయిన లేదాపదినుండి పన్నెండుసంవత్సరాలవయస్సుగల విద్యార్దులు ఈశిక్షణాకార్యక్రమానికి అర్హులు అనితెలిపారు. బాలికలు వివిదఅంశాలుపైఅవగాహనకల్పించడము,తద్వారావారికీ గలవిస్తృతమైనఅవకాశాలునువారిని గుర్తించేలా చేయడము, వ్యక్తిగతఅరోగ్యానికి సంబందించిన విషయాలుపట్లఅవగాహన కల్పించడముఈకార్యక్రమంయొక్కఉద్దేశాలు అని తెలిపారు. మేనెలనాల్గోవతేదినుండి ముప్పై ఒకటివతేది వరకూ నాలుగువారాలు ఉంటాయని తెలిపారు. ఈకార్యక్రమానికీ సంబందించి దరఖాస్తులు స్వీకరిస్తున్నామనీ అదికార్లు తెలిపారు.

## అవంతీ సైన్యం ఆధ్వర్యంలో ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



భీమునిపట్నం : స్థానిక వై.సి.పి.కార్యాలయం లో వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం అవంతి సైన్యం ఆద్వర్యంలో ఘణంగా జరిగింది ఎనిమిది సంవత్సరాలు పూర్తి చేసుకొని తొమ్మిదవ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్బంగా ఆర్.ప్రభాకర్ నాయుడు, ఆద్వర్యంలో కేక్ కట్ చెసి అందరికి పంచి పెట్టారు. ఈ కార్యక్రమములో ఎస్. వంశి, బి. సాయి, కొయ్య. రామక్రిష్ణ,,మొకర.శంకర్, ఎ. రవికుమార్,నందు,చీ. ప్రనయ్, డి. సూరి రెడ్డి,వి.కనక రాజు,చంద్రశేఖర్,రెడ్డి మహేశ్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సీపట్నంలో ఘనంగా వైసీపీ ఆవిర్భావ వేడుకలు



నర్సీపట్నం : వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తొమ్మిదవ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను నర్సీపట్నంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ సమన్వయకర్త పెట్ల ఉమాశంకర్ గణేష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో వైసిపి నియోజకవర్గ కార్యకర్తలు నాయకులు మధ్య ఈ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా నియోజకవర్గ కన్వీనర్ ఉమాశంకర్ గణేష్ కేక్ కట్ చేసి పార్టీ కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు ఈసందర్భంగా ఉమాశంకర్ గణేష్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో నర్సీపట్నం నియోజకవర్గంలో అత్యధిక మెజార్టీతో విజయం సాధించనున్నామని ధీమా వ్యక్తం చేశారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత జగన్మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం ఏర్పరచుకున్నారని అన్నారు. పార్టీ పట్ల ప్రజలకు ఉన్న ఆదరణ అభిమానాన్ని చూసి తెలుగుదేశం పార్టీ నాయకుల్లో రైళ్లు పరిగెడుతున్నాయన్నారు. చంద్రబాబునాయుడు వివిధ రకాల సంక్షేమ పథకాలు పేరుతొ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ సంక్షేమ పథకాలు అమలు సాధ్యాసాధ్యాలపై రాష్ట్ర ప్రజలు సూక్ష్మ స్థాయిలో పరిశీలన చేస్తున్నారని అన్నారు. అధికార దాహంతో చేపట్టే సంక్షేమ పథకాలు అమలు చేయలేదని ప్రజలు భావిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం నాతవరం మాకవరపాలెం గొలుగొండ మండలాలకు చెందిన వైఎస ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు మహిళలు అభిమానులతో పాటు కోనేటి రామకృష్ణ, సుర్ల గిరిబాబు, బయపురెడ్డి చినబాబు, చోటి పాల్గొన్నారు.

**మొదటి పేజీ తరువాయి**

### ఎన్నికల వేడి రాజుకుంది

నేతలను పార్టీ అధిష్ఠానం అమరావతికి పిలిపించింది. యనమల, సుజనాచౌదరి ఆధ్వర్యంలోని రెండు సమన్వయ కమిటీల ద్వారా ఆయా నియోజకవర్గాల నేతల అభిప్రాయాలను సేకరించారు. మాడుగుల, నెల్లిమర్ల, నూజివీడు, గజపతినగరం, మదనపల్లి, తిరువూరు, ఆత్మకూరు, పాతపట్నం, తిరుపతి, ఉదయగిరి, చిత్తూరు, విశాఖ దక్షిణం, చోడవరం, అమలాపురం, పి.గన్నవరం, ప్రొద్దుటూరు నేతలతో సమన్వయ కమిటీలు సమీక్షలు నిర్వహిస్తున్నాయి.

మరోవైపు అనంతపురం జిల్లాలోని శింగనమల, కల్యాణదుర్గం, గుంతకల్లు నియోజకవర్గాల నేతలతో సీఎం చంద్రబాబు సమీక్షిస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో సిట్టింగులను కొనసాగిస్తారా? లేదా? అనేదానిపై ఉత్కంఠ నెలకొంది. విశాఖ జిల్లా మాడుగుల నుంచి రామానాయుడు పేరు దాదాపుగా ఖరారైంది. కృష్ణా జిల్లా నూజివీడు నుంచి ముద్రబోయిన, దేవినేని అపర్ణ, అట్లూరు రమేశ్ పోటీ పడుతుండగా.. కైకలూరు నుంచి జయమంగళ వెంకటరమణ, సీఎల్ వెంకట్రావు, దోనెపూడి పవన్ టికెట్ దక్కించుకోవాలని ప్రయత్నాలు సాగిస్తున్నారు. విజయనగరం జిల్లా గజపతినగరంలో సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కె.అప్పలనాయుడు సోదరుడి నుంచే పోటీ ఎదుర్కొంటున్నారు. కడప జిల్లా ప్రొద్దుటూరులో వరదరాజులు రెడ్డి, లింగారెడ్డి పోటీలో ఉండగా.. కొత్తగా వీరశివారెడ్డి అభ్యర్థిత్వం కూడా తెరపైకి వచ్చింది. ఒకటి రెండు రోజుల్లో పెండింగ్‌లో ఉన్న నియోజకవర్గాల జాబితా మొత్తం ఖరారవుతుందని తెదేపా వర్గాలు చెబుతున్నాయి.

### హవాలా రాకెట్టు గుట్టురట్టు

లక్షలు, నసీమ్ వద్ద రూ.5.70 లక్షలు, విశాల్ జైన్ వద్ద రూ.11.80 లక్షలను స్వాధీనం చేసుకున్నట్లు నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ వెల్లడించారు. వీటికి నిందితులు ఎలాంటి ఆధారాలు చూపించలేదని చెప్పారు. వీరు గత కొంత కాలంగా వేర్వేరుగా హవాలా వ్యాపారం నిర్వహిస్తూ డబ్బులు తరలిస్తున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలిందన్నారు. వీరి వద్ద నుంచి మూడు క్యాష్ కౌంటింగ్ యంత్రాలతోపాటు నాలుగు ద్విచక్రవాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున 50వేల రూపాయలకు మించి ఎక్కువ వెంట ఉంచుకోవద్దని... అంతకంటే ఎక్కువ డబ్బు ఉంటే దానికి తగిన ఆధారాలు చూపాలని చెప్పారు.

### డేటా ట్రాన్స్‌ఫర్ చేయడం తప్పే

6.1 శాతం పెరిగిందని చెప్పారు. రాఫెల్ ధర ఎంతో ఇప్పటివరకు కేంద్రం చెప్పకపోవడం దారుణమన్నారు.

### అందరూ సమన్వయంతో పనిచేయాలి

ప్రతి రోజు పరిశీలించి సంబందిత అభ్యర్థి ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. ఎన్నికల ప్రచారానికి ఉపయోగించే వాహనాల వివరాలను ముందుగా తెలియజేసి పర్మిషన్ తీసుకోవాలన్నారు. సోషల్ మీడియా, పేస్బుక్ లలో కులమతాలు, సమూహాలమీద వ్యక్తిగత ఆరోపణలు చేపట్టరాదన్నారు. అటువంటి సమాచారం వస్తే ఎన్నికల కమిషన్ తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ఎన్నికలు జరిగే తేదీకి 48 గంటల ముందు ఎన్నికల ప్రచారం చేయరాదన్నారు.

ఈ సమావేశంలో సిపి మ హేష్ చంద్ర బడ్డా, యస్.పి అట్టాడ బాపూజీ , పలు రాజకీయ పార్టీల ప్రతి నిధులు, కలక్టర్ ఎలక్షన్ సూపరింటెండెంట్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీలోకి పాలకొల్లు మాజీ ఎమ్మెల్యే బాబ్జీ

లోటస్‌పాండ్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో బాబ్జీ భేటీ అయ్యారు. అనంతరం పార్టీలో చేరిన ఆయనను వైఎస్ జగన్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.

పార్టీలో చేరిన అనంతరం బాబ్జీ మీడియాతో మాట్లాడారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర ఒక యజ్ఞమని కొనియాడారు. రాష్ట్ర అవసరాలు దగ్గరి నుంచి గమనించి.. వాటినుంచి వైఎస్ జగన్ ఎంతో నేర్చుకున్నారని తెలిపారు. చిన్న తరహా పరిశ్రమలతో రాష్ట్రానికి న్యాయం జరిగే అవకాశముందన్నారు. యంగ్ జనరేషన్ నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉందని, అవకాశమిస్తే తప్పకుండా పాలకొల్లు నుంచి పోటీ చేస్తానని చెప్పారు

### పాల్ రావాలి.. పాలన మారాలి

బ్యాంకు ఉందని.. ఎన్నికల్లో తమ విజయం తథ్యమని పాల్ ధీమా వ్యక్తం చేశారు. 20వ తేదీలోపు తమ అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తామని చెప్పారు. పాల్ రావాలి.. పాలన మారాలంటూ ఆయన వ్యాఖ్యానించారు.

## కోర్టు ప్రాంగణంలో వ్యక్తి మృతి

విజయనగరం : జిల్లా న్యాయస్థానం ప్రాంగణంలో ఓ వ్యక్తి ప్రాణాలు విడిచాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని మంగళవీదికి చెందిన ఎస్.నాగేశ్వర్‌రావు(53) సోమవారం ఉదయం ఓ కేసు నిమిత్తం కోర్టుకు వెళ్లాడు. న్యాయవాదిని కలిసేందుకు పరుగెత్తుతున్న సమయంలో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఘటన స్థలంలో ఉన్నవారు బాధితుడిని కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అయితే నాగేశ్వర్‌రావు అప్పటికే చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడని పోలీసులు పేర్కొన్నారు. భార్య, భర్తల మధ్య వివాదాల కారణంగా గత కొంతకాలంగా కోర్టుకు హాజరవుతూ ఉన్నాడని చెప్పారు. అనారోగ్యంతోనే చనిపోయి ఉంటాడని గ్రామీణ స్టేషన్ పోలీసులు పేర్కొన్నారు. కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## తిత్లీ తుపాను బాధితులకు తిప్పలు

పార్వతీపురం : ఎన్నికల నగారా మోగింది. ఏప్రిల్ 11న రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల నియమావళి అమల్లోకి రావడంతో చాలావరకు మంజూరు కావాల్సిన పనులు వెనక్కి వెళ్లినట్లే చెప్పుకోవాలి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో తిత్లీ తపాను బాది ందులో పాక్షికంగా ఇళ్లు నష్టపోయిన వారికి కూడా కొత్తగా మంజూరు చేయాలని ప్రతిపాదించారు. ఇప్పటివరకు కేవలం 118 ఇళ్లు మాత్రమే మంజూరయ్యాయి. వీటిని ప్రారంభించుకొనే అవకాశం ఉన్నప్పటికీ కొత్తగా మంజూరు కావాల్సిన ఇళ్లకు అవాంతరం వచ్చినట్లే అయ్యింది. ఏప్రిల్ 11తో ఎన్నికల ముగిసినపోయినా కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యేందుకు జూన్ మొదటి వారం వరకు వేచి చూడాల్సి ఉంటుంది. ఈ రెండు నెలల వ్యవధిలో వేసవి తీవ్రతను గిరిజనులు ఎదుర్కొనాల్సి వస్తుంది. మంజూరులు వేగంగా తెచ్చే సంకల్ప బలం లేకపోవడం వల్ల గిరిజనులు ఇబ్బందుల్లో పడినట్లయ్యింది.

## బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య

విజయనగరం : కుటుంబ కలహాలు తట్టుకోలేక ఓ బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన పట్టణంలోని తోట పాలెంలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. ఎస్.దివాకర్‌రావు(58) చత్తీస్‌ఘడ్‌లోని జగదల్‌పూర్‌లో గ్రామీణ వికాస్ బ్యాంకు మేనేజర్‌గా పనిచేస్తూ అక్కడే ఉంటున్నాడు. శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడంతో శుక్రవారం సాయంత్రం తోటపాలెంలో నివాసముంటున్న భార్య, పిల్లలను కలిసేందుకు వచ్చాడు. కుటుంబ సభ్యుల మధ్య వివాదం తలెత్తడంతో దివాకర్‌రావు ఆదివారం రాత్రి విధులకు వెళతానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరాడు. విధులకు వెళ్లేటప్పుడు తీసుకెళ్లే బ్యాగ్ ఇంట్లోనే ఉండటంతో అనుమానం వచ్చిన పిల్లలు తండ్రి కోసం వెతికారు. సోమవారం ఉదయం ఇంటి పక్కనే ఉన్న ఖాళీ ప్రదేశంలో దివాకర్ మృతదేహంతో పాటు పురుగుల మందు డబ్బా ఉన్నట్లు గమనించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఎస్పై కిరణ్‌కుమార్ నాయుడు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మ ృతుడికి భార్య మాధవి, కూతురు మౌనిక, కుమారుడు వరుణ్ ఉన్నారు. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్య చేసుకొని ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

### విద్యార్థుల ఫీజు చెల్లింపు మరింత సులభతరం

విజయనగరం : స్థానిక ఎంవిజిఆర్ కళాశాల స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాలో కలసి కుదుర్చుకున్న డిజిటల్ పేమెంట్స్ ఒప్పందాన్ని ప్రారంభించారు. ఈ ఒప్పందంతో కళాశాలలో ఏ విద్యార్థి అయినా తమ ఫీజులను ఆన్‌లైన్ ద్వారా ఎక్కడ నుంచి అయినా అత్యంత సులభంగా చెల్లించే సదుపాయం కళాశాల యాజమాన్యం కల్పించింది.

## తడి-పొడి చెత్త వేరుచేసి
# వాహనాలకు అందించండి

- ప్రజలు చెత్త సేకరణ వాహన సౌకర్యం వినియోగించుకోవాలి
- భవన నిర్మాణ బిల్డింగ్ ప్లాన్లను పరిశీలించండి
- డ్రెయిన్లు, గెడ్డలు పరిశుభ్రపరచండి
- దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలి
- వ్యాధిరహిత, ఆరోగ్య విశాఖగా తీర్చిదిద్దండి
- జివిఎంసి కమిషనర్ హరినారాయణన్



విశాఖపట్నం: ప్రజలు తడి-పొడి చెత్తను వేరుచేసి చెత్త సేకరణ వాహనాలకు అందించేలా చూడాలని జివియంసి కమిషనర్ హరినారాయణన్ పేర్కొన్నారు. క్షేత్ర పర్యటన సందర్భంగా ఒకటవ జోన్ 3వ వార్డును సందర్శించి, మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్ని వార్డులను పరిశుభ్రంగా నిర్వహించాలని కోరారు. చెత్త సేకరణకు వినియోగిస్తున్న వాహనాలు వార్డులలో పర్యటించే సమయాలను ప్రజలకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఒకటవ జోన్‌కు చెందిన మూడవ వార్డు రవీంద్రనగర్, సుందర్‌నగర్, ఆదర్శనగర్‌లలో పర్యటించారు. నిర్మాణంలోనున్న భవనాలు ప్లాన్‌ప్రకారం నిర్మిస్తున్నది లేనిదీ అనుమతి తీసుకొన్నది లేనిది పరిశీలించాలని పేర్కొన్నారు. డ్రెయిన్లు, గెడ్డలు పరిశుభ్రంగా ఉంచాలని ఓపెన్ పోగులు లేకుండా చూడాలని కోరారు. దోమలు వ్యాప్తి ఉత్పత్తి జరుగకుండా చూడాలని కోరారు. నగరాన్ని వ్యాధిరహిత, ఆరోగ్య విశాఖగా తీర్చిదిద్దాలని పేర్కొన్నారు.

పర్యటనలో జోనల్ కమిషనర్ దుర్గాప్రసాద్, ఏ.యం.ఓ.హెచ్ డా.యస్.జయరాం, ఇ.ఇ ఉదయ్‌కుమార్, డి.ఇ దిలీప్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మసాగరంలో జనబాట



నర్సీపట్నం: మండలంలోని ధర్మసాగరం గ్రామంలో సోమవారం రాత్రి జనబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు జనసేన సిద్ధాంతాలను వివరించి గ్లాస్ గుర్తుకు ఓటేయ్యాలని కోరారు. పవన్ కళ్యాణ్‌తోనే సుస్థిరమైన పాలన సాధ్యమౌతుందన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం జనసేన నాయకులు మారిశెట్టి రాజా, అశోక్ బయపురెడ్డి, గణేష్, ద్వారపూడి జగదీష్, కొప్పాక కళ్యాణ్, కర్రి సురేష్, వి.చక్రవర్తి, పి.నాయుడు, గుణశేఖర్, తాతబాబు, మారిశెట్టి ప్రభు, నవీన్, గొల్లపల్లి హరీష్, ధర్మసాగరం కార్యకర్తలు నాని, కిరణ్ పాల్గొన్నారు.

# కొత్తకోట పిహెచ్‌సి వద్ద సాధువు మృతి

రావికమతం: కొత్తకోట పిహెచ్‌సి వద్ద గుర్తు తెలియని సాధువు మృతి చెందాడు. పిహెచ్‌సి అధికారులు అందించిన వివరాల ప్రకారం సోమవారం ఉదయం చికిత్స నిమిత్తం పిహెచ్‌సికి వచ్చాడని, వైద్య పరీక్షల అనంతరం మందులు అందించామన్నారు.

అతనికి నోటి వెంట తీవ్ర రక్తస్రావం జరుగుతుండటంతో దానికి సంబంధించిన మందులను అందించామని తెలిపారు. అలాగే గత రెండు రోజులుగా పిహెచ్‌సి వద్ద ఉండటంతో ఆయనకు భోజనం కూడా పెట్టించామన్నారు. మంగళవారం ఉదయం కూడా పిహెచ్‌సి సిబ్బందితో మాట్లాడి పక్కనే ఉన్న అరుగుపై పడుకొని మృతి చెందినట్లు తెలిపారు. ఆయన గంజాయి విపరీతంగా సేవించేవాడని, పేరు, ఊరు అడిగినా ఎటువంటి సమాచారం తెలపలేదని తెలిపారు. మృతి చెందిన సమాచారాన్ని కొత్తకోట పోలీసులకు అందించడంతో పోలీసులు కేసు నమోదు చేసి దహన సంస్కరాలకు ఏర్పాట్లు చేశారు. దహన సంస్కారాలకు అయ్యే ఖర్చును పిహెచ్‌సికి సమీపంలో ఉన్న కెజెఎన్ సేయింట్ పీటర్స్ ప్రిన్సిపాల్ గంగరాజు, పిహెచ్‌సి సిబ్బంది భరించారు.

# డ్వాక్రా మహిళలతో బ్యాంకులు కిటకిట

యలమంచిలి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రెండో విడత పసుపు కుంకుమ చెక్కులను నగదు మార్చుకోడానికి వస్తున్న మహిళలతో బ్యాంకులు కిటకిట లాడుతున్నాయి. యలమంచిలి మండలంలోని 637 డ్వాక్రా సంఘాలకు పసుపు కుంకుమ కింద ప్రభుత్వం రెండో విడత మొత్తంగా రూ.3500 చొప్పున చెక్కులు ఇచ్చింది.

మహిళలు పెద్ద సంఖ్యలో ఒకేసారి వస్తుండటంతో ఆంధ్రా బ్యాంకు, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్‌బిఐ), బ్యాంకు ఆఫ్ బరోడాలు ఖాళీ ఉండటం లేదు. ఒకేసారి వందలాది మంది వస్తుండటంతో సిబ్బందికి క్షణం తీరిక ఉండటం లేదు.

# ప్రవర్తన నియమావళిపై అధికారుల నిర్లక్ష్యం



మధురవాడ: ఎన్నికల నిబంధనలు అమల్లోకి వచ్చినా మహా విశాఖ జోన్-1 అధికారులు అలసత్వం వహిస్తున్నారు, ఎన్నికల కమిషన్ స్పష్టంగా ప్రకటించినప్పటికీ 4వ వార్డు పీఎంపాలెంలో రాజశేఖర రెడ్డి విగ్రహానికి ముసుగు వెయ్యలేదు.

అదే విధంగా 5వ వార్డు అన్న క్యాంటీన్ లో గల సీఎం చంద్రబాబు, ఎన్టీఆర్ చిత్రాలతో కూడిన హెూర్డింగ్‌లు తొలగించడంలో ఉదాసీనత చూపుతున్నారు, మరికావలస గాయత్రీ ఆసుపత్రి జాతీయ రహదారిపై ఎన్టీఆర్ చిత్రంతో కూడిన ఎన్టీఆర్ వైద్యసేవ హెూర్డింగ్స్‌ను కూడా తొలగించలేదు. అసలే సమయపాలన లేని అధికారులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిపై అలసత్వం వహించడంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## సింహాచలం పంచగ్రామాల భూ సమస్యపై
# ప్రభుత్వ జీవోలో లోపాలు సవరించాలి




విశాఖపట్నం: టిడిపి అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లో సింహాచలం పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరిస్తామని ప్రణాళికలో ప్రకటించింది. ఎన్నికలకు వారం రోజుల ముందు ఆదరబాదరగా అవకతవకల జి.వోను జారీ చేసింది. ఇది ఎన్నికల్లో ప్రయోజనం కోసం టిడిపి జారీ చేసిన జీవో మాత్రమే. గత టిడిపి ప్రభుత్వం జీవో.నెం.578ను 2000 సంత్సరంలో సింహాచలం దేవస్థానం భూములన్నింటికి నూరుశాతం మరియు ఇళ్ళస్థలాలకు 70శాతం మార్కెట్ రేటును చెల్లించాలని జివో సారాంశం. దీనిని పంచగ్రామాల ప్రజలు ముక్తకంఠంగా వ్యతిరేకిస్తున్నారని భారత కమ్యూనిస్టు పార్టీ గ్రేటర్ విశాఖ నగర కమిటీ ఖండిస్తోంది. మంగళవారం తమ కార్యాలయంలో సమావేశాన్ని ఏర్పాటు చేసి ఈ విషయాన్ని ప్రస్తావించారు. ఈ సందర్భంగా సీపిఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిహెచ్. నరసింగరావు మాట్లాడుతూ 004 వరకు ఆ జీవో ఉన్నా ఎవరు డబ్బులు చెల్లించలేదన్నారు. తరువాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు వాగ్ధానం చేసి అమలు చేయలేదు. టిడిపి అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాలు తరువాత జీ.వో.నెం. 229ను జారీచేసింది. ఈ జీవోలో 300 గజాల్లోపు వున్నవారికి కొంత ప్రయోజనం జరుగుతున్నట్లు ఆ జీవోలో పేర్కొన్నారు. వీరందరూ గతంలో డబ్బులు చెల్లించి స్థలాలు కొనుకున్నవారే. అయినా 30శాతం మార్కెట్ రేటు చెల్లించవలసి వచ్చింది. 2000 సంవత్సరం జీవో కంటే ఇదిమేలు. సిపిఎం ఆధ్వర్యంలో 1998 నుంచి నిరంతర పోరాటాలు సాగిన ఫలితంగానే ఈ జోవో వచ్చింది. ఇది సిపిఎం పోరాటాల విజయం.

2019 మార్చి 7వ తేదీన టిడిపి ప్రభుత్వం జారీచేసిన జివోలో వేలాది మంది రైతులకు ఎటువంటి ప్రయోజనం లేదు. వంద సంవత్సరాల నుంచి ఇనాం భూముల్లో వ్యవసాయం చేస్తున్న రైతులకు టిడిపి ప్రభుత్వం పూర్తిగా మొండిచెయ్యి చూపింది. 2008 తరువాత ఇళ్ళస్థలాలు కొనుకున్న వేలాది మందికి ఈ జీ.వో వర్తించదు. 300 గజాలకు మాత్రమే 30శాతం మార్కెట్ ధర వర్తిస్తుంది. అంటే 300 గజాల్లోపు వున్నవారు 30శాతం మార్కెట్ ధర చెల్లించాలి. సింహాచంల దేవస్థానం భూములన్నీ సర్వే నెం.275లో వున్నాయి. ఈ సర్వేనెంబర్‌లో కొన్ని ప్రాంతాలకు గజానికి రూ.30వేలకు పైగా వుంది. తరతరాల నుంచి ఈ భూమిలో నివశిస్తున్న వారు కోట్ల రూపాయలు చెల్లించుకోవడం సాధ్యమౌతుందా? 300 గజాలకు ప్రారంభం 30శాతంగా జీవోలో వుంది. 30శాతం దాటిన తరువాత నేటి మార్కెట్ విలువతో సమానంగా చెల్లించాలని నోటిఫికేషన్‌లో స్పష్టంగా పేర్కొన్నారు. ఎంత నిర్ణయిస్తారనేది ఇందులో పేర్కొనలేదు. ఎన్నికల తరువాత వారికి ఇష్టం వచ్చినట్లుగా నిర్ణయించడానికి అధికారాన్ని తమ చేతుల్లో పెట్టుకున్నారు. ప్రభుత్వం జారీ చేసిన మరో జీ.వో.నెం.232లో నియమావళిని పొందుపర్చారు. ఈ నియమావళిలో సింహాచలం దేవస్థానం ఇచ్చిన ఇంటినెంబరు పేరుమీద ఆనాటి యజమాని మారినట్లు అయితే వారికి ఆ భూమిపై ఎటువంటి అధికారం వుండదు. ఆనాడు యజమానులు కానివారు ఎంత చెల్లించవలసి వుంటుందో జీవోలో లేనందువల్ల వీరి మీద కూడా తరువాత మార్కెట్ రేటు చెల్లించాలని ఒత్తిడి చేసే అవకాశం వుంది.

సింహాచలం పంచగ్రామాల జివో తలలేని మొండెం లాంటిదే. కేంద్ర ప్రభుత్వం రైల్వేజోన్ కేటాయించిన విధంగా ఎన్నికల్లో లబ్ధికోసం ఈ జీవోను జారీ చేసింది. ఇది ప్రజలను చీల్చింది. కేవలం 300 గజాలు లోపు వున్నవారికి కొంత వూరటకలిగింది. మిగిలిన సింహాచలం దేవస్థానం బాధితులందరినీ మరలా నరకకూపంలోకి టిడిపి ప్రభుత్వం నెట్టింది. ఇప్పటి దాకా హైకోర్టులో కేసులు వున్నాయని ప్రజలను మోసగించింది. ఎన్నికలు వచ్చేసరికి ఏ కేసులు లేవని రుజువైంది. దేవస్థానం భూములు కాబట్టి భూమికి ప్రభుత్వ భూమిని బదులివ్వడం ఒక్కటే ఇందులో కీలకం. కనుక మిగిలిన సింహాచలం బాధితులందరికీ కూడా పూర్తి హక్కులు కల్పించాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నది. లేనిఎడల తగిన మూల్యం చెల్లించుకోవలసి వుంటుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం హెచ్చరిస్తున్నది.

## పేద ప్రజలకు రాజ్యాధికారం సాధించే దిశగా..
# జేఏసీ పని చేస్తుంది



డాబా గార్డెన్స్: రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాలు కోటి నలభై ఏడు లక్షల అరవై ఆరు వేల ఎనిమిది వందల యాభై తొమ్మిది కుటుంబాలు వారు ఉన్నారని, తెల్ల రేషన్ కార్డు కలిగిన కుటుంబాల రాజ్యాధికారమే లక్ష్యంగా తమ పార్టీ పని చేస్తుందని డాక్టర్. బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలు సాధన జేఏసీ అధ్యక్షుడు తుమాటి బాబు రావు పేర్కొన్నారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో బాబురావు మాట్లాడుతూ పేదవారిని ముఖ్యమంత్రిగా చేయాలనే లక్ష్యంగా తాము పనిచేస్తామన్నారు. తాము అధికారానికి వస్తే కుల,మత, వర్గ, వర్ణ, ప్రాంతీయ తేడాలు లేకుండా తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి వారికి నెలకు మూడు వేల రూపాయల కుటుంబ భ ృతి, సంవత్సరమునకు 300 రూపాయలతో ఇంక్రిమెంటు అందిస్తామన్నారు. భూమి లేదా 15 లక్షల రూపాయల ఫిక్స్‌డ్ డిపాజిట్ ద్వారా నెలకు 15 వేల రూపాయలను అందిస్తామన్నారు. ఈ సందర్భంగా మేనిఫెస్టోను విడుదల చేశారు .అనంతరం ప్రముఖ న్యాయవాది లీగల్ సెల్ కన్వీనర్ బి. రమేష్ మాట్లాడుతూ మద్యపానం దాని అనుబంధ డ్రగ్స్‌ను నిషేధిస్తామన్నారు. నిరుద్యోగ యువతీ యువకులకు జీవనభృతి ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. గిరిజన ప్రాంతాల ప్రజలకు స్పెషల్ డ్రైవ్ ద్వారా రోడ్లు, గృహాలు, నీరు ,విద్య, వైద్యం, ఉద్యోగాలు మొదలైన సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మహిళలు, మైనార్టీ యువతకు అన్ని రకాలుగా ఆదుకుంటామని తమ మేనిఫెస్టోలో పేర్కొన్నామన్నారు. తిండి ,బట్ట, ఇల్లు, స్కూలు, భద్రత, సరైన వైద్యం, నీరు ప్రధాన అంశాలుగా నెరవేరుస్తామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జేఏసీ నాయకులు డాక్టర్. వి. శ్రీనివాసరావు ,ఆది నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



నాతవరం: సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. గాంధీనగరంకు చెందిన దండ సింహాచలం(45) రాత్రి ద్విచక్ర వాహనంపై తాండవ జంక్షన్‌కు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఏపి31 టిఎం 1354 నెంబరు గల బలెరో పికప్ వ్యాన్ ఢీకొట్టింది. దీంతో సింహాచలం అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని నాతవరం ఎస్సై వి. సత్యనారాయణ తెలిపారు.

# కుటుంబ పాలనలను రూపుమాపాలి



డాబా గార్డెన్స్: ఎన్నో ఏళ్లుగా బడుగు బలహీన మైనారిటీ మహిళా వర్గాలు కేవలం ఓటు బ్యాంకు గానే మారారని ఓట్లు మావి సీట్లు మీవి అనే కాలం అయిపోయిందని, ఓట్లు మావే సీట్లు మావే అని 2019 ఎన్నికల్లో నిరూపించాలని కుటుంబ పాలనను నిర్మూలించి ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ మహిళలు యువత మేల్కొని తమ పార్టీని గెలిపించాలని ప్రజలకు జాతీయ సమ సమాజం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు ఏ.పి. రామయ్య యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం విజెఎఫ్ ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వరాజ్య పాలనలో పేద ప్రజల బతుకులు బాగుపడతాయని ఎన్నెన్నో ఆశలు పెట్టుకుని ఎంతో మంది ఉన్నారన్నారు. కానీ 70 సంవత్సరాల నుంచి దేశంలో రాష్ట్రంలో కుటుంబ పాలన కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్లో అయితే సుమారు 30 సంవత్సరాల నుంచి రెండు కుటుంబాల పాలనలోనే ఒకరు ముఖ్యమంత్రి అయితే, మరొకరు ప్రతిపక్ష నాయకుడిగా ఉండటం ఎంత వరకు సమంజసమో ప్రజలు ఆలోచించాలన్నారు. కుల రాజకీయాలు, మత రాజకీయాలు, వంశానుగత రాజకీయాలు చేసి రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించడం దౌర్భాగ్యం అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి రాజకీయ అధికారమే ముఖ్యమని గుర్తించిన మేధావులు ,విద్యావంతులు, సామాజిక కార్యకర్తలు, కులం, మతం, డబ్బు లేని స్వచ్ఛమైన రాజకీయం కోసం నిక్కచ్చిగా నిలబడేందుకు ఈ జాతీయ సమ సమాజం పార్టీ స్థాపించడం జరిగింది అన్నారు. ఓటర్లే నాయకులుగా, నాయకులే సేవకులుగా సరికొత్తగా రాజకీయం చేసేందుకు తమ పార్టీ ప్రజల ముందుకు వచ్చిందన్నారు. ప్రజలు సహకరించి 2019 ఎన్నికలలో జాతీయ సమ సమాజం పార్టీని గెలిపిస్తే ఆర్థిక, రాజకీయ, సామాజిక అధికారం అందరికీ కల్పిస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి మండలంలో ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు చేసి ఉచిత వైద్యం అందిస్తామన్నారు. ప్రతి గ్రామం నందు పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు అందుబాటులోకి తెస్తామన్నారు. ఉచిత విద్యా సౌకర్యం ఇప్పిస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, త్రాగునీరు, సాగునీరు అందిస్తామని, ప్రస్తుతం ఉన్న సంక్షేమ కార్యక్రమాలు, స్కీములు కొనసాగిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ అంతటా ఎమ్మెల్యే, ఎంపీ సీట్లకు పోటీ చేస్తామన్నారు. జాతీయ సమసమాజం పార్టీ గుర్తు కెమెరా కు ఓటు వేసి గెలిపించాలని ఈ సందర్భంగా ప్రజలందరినీ ఆయన కోరారు.

# ఎన్నికల నిబంధనలు పాటించాలి



నర్సీపట్నం: నర్సీపట్నం నిబంధనలు పాటించాలని నర్సీపట్నం ఏఎస్పీ ఆరిఫ్‌హఫిజ్ కోరారు. మున్సిపాలిటీలోని పీనారిపాలెంలో ప్రజలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ నిబంధనలకు అనుగుణంగా ప్రతీ ఒక్కరూ నడుచుకోవాలన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. స్వచ్ఛగా ఓటు వేసే అవకాశాన్ని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టౌన్ సిఐ లక్ష్మణరావు, ఎస్సైలు దామోదర్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

# 18నుంచి క్రికెట్ టోర్నీ

కొయ్యూరు: బంగారుతల్లి తీర్థం సందర్భంగా ఈ నెల 18వ తేదీ నుంచి కొయ్యూరులో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఈ నెల 17లోపు వివరాలు అందజేయాలని కోరారు. ప్రవేశ రుసుం రూ.500 చెల్లించాల్సి ఉందన్నారు. ప్రధమ బహుమతిగా రూ.10వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5వేలు అందజేయనున్నట్లు చెప్పారు. వారి ఆధార్ కార్డు జెరాక్స్‌లను అందజేయాలని కోరారు. పూర్తి వివరాల కోసం 9441468828, 9490793072, 9491543547 నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

# బాలికలతో తల్లి దండ్రులు స్నేహ భావంతో మెలగాలి

- బాలికల పోషణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి
- ఐ.సి.డి.ఎస్ అర్బన్ - 1 సి.డి.పి.ఓ ఎస్ .పద్మావతి



కంచరపాలెం: బాలికలతో వారి తల్లి దండ్రులు స్నేహ భావంతో మెలగాలని ఐ .సి.డి.ఎస్ అర్బన్ - 1 సి.డి.పి.ఓ ఎస్ .పద్మవతి పేర్కొన్నారు . ఈ మేరకు "పోషణ అభియాన్‌లో బాగస్వాములవుదాం ,శక్తి వంతమైన భావితరాలను నిర్మిద్దాం" అనే నినాదంతో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పోషణ సంబరాలు కార్యక్రమాన్ని జీవీఎంసీ 39వ వార్డు పరిధి మాధవధార జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించారు . ఈసందర్భంగా సి.డి.పి.ఓ ఎస్ .పద్మవతి మాట్లడుతూ బాలికలతో తల్లి దండ్రులు స్నేహ భావంతో మెలుగుతూ ఎప్పటికప్పుడు వారి సమస్యలు తెలుసుకుంటూ సమస్యను పరిష్కరించే విధంగా తల్లి దండ్రులు దృష్టి సారించాలన్నారు .

అదేవిదంగా బాలికల పోషణపై తల్లి దండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు . అలాగే కౌమార దశలో ఎదురయే ఇబ్బందులు ఎదుర్కోవడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై బాలికలకు సమగ్ర అవగహన కల్పించారు. అంతకుముందు విధ్యార్థులకు వివిద ఆటల పోటీలు నిర్వహించారు . కార్యక్రమంలో ఐ .సి.డి.ఎస్ అర్బన్ - 1 సూపర్ వైజర్లు రాజేశ్వరి, నిర్మల, టెల్మా , మనసా, శ్రవంతి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు .

## 13న ఖాళీ దుకాణాలు పంక్షన్ హాళ్లకు వేలం

కంచరపాలెం: జీవీఎంసీ జోన్ -4 పరిదిలో ఖాళీగా వున్న దుకాణ సముదాయం , షాప్ లు పంక్షన్ హాళ్ల నిర్వహణకు సంబందించి 13న జ్ఞానపురం జీవీఎంసీ జోన్ -4 కార్యాలయం వద్ద ఉదయం 11 గంటలకు వేలం నిర్వహిస్తునట్లు జీవీఎంసీ జోన్ -4 కమిషనర్ ఎస్ .రమణమూర్తి ఒక ప్రకటనలో తెలియజేశారు . దుకాణాలు, కళ్యాణ మండపాలు నిర్వహించడానికి 3 సంవత్సరాల కాల పరిమితి ఉంటుందని తెలిపారు . అసక్తి గలవారు 13 వ తేది ఉదయం 11 గంటలకు బహిరంగ వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు . వేలంలో పాల్గున దలచినవారు 200 రూపాయలు జీవీఎంసీ పేరుతో చలానా చెల్లించి వేలం పాటలో పాల్గొనాలని ఈ సందర్భంగా ఆయన కోరారు .

# విజయభాను

## సంపాదకీయం

### ఆత్మగౌరవంతో రాజకీయపక్షాలు

సార్వత్రిక ఎన్నికల ప్రకటన లాంఛనంగా విడుదల కావడంతో పోలింగ్ దశలు, తేదీలకు సంబంధించి స్పష్టత ఏర్పడ్డది. లోక్‌సభతో పాటు ఏపీ, అరుణాచల్‌ప్రదేశ్, ఒడిశా, సిక్కిం రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరుగుతున్నాయి. తెలంగాణ అసెంబ్లీకి కూడా లోక్‌సభతోపాటే ఎన్నికలు జరుగాల్సింది. కానీ అసెంబ్లీ ఎన్నికలు ముందే జరుపుకోవడంతో కేసీఆర్ ముఖ్యమంత్రి పీఠంపై ఠీవీగా కూర్చొని, ఏ ఒత్తిడి లేకుండా లోక్‌సభ ఎన్నికలపై దృష్టిపెట్టే అవకాశం లభించింది. జాతీయ పరిణామాలను నిశితంగా గమనిస్తున్న కేసీఆర్ రాబోయే పరిణామాలను ముందే ఊహించి వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ప్రాంతీయ పార్టీల ప్రాభవానికి తగినట్టుగా పథక రచన చేసి ఫెడరల్ ఫ్రంట్‌ను ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలో జాతీయ రాజకీయాలు విశేష ప్రాధాన్యం సంతరించుకున్నాయి. సంకీర్ణ రాజకీయాలు ప్రారంభమైన నాటినుంచి ప్రాంతీయ రాజకీయపక్షాల ప్రాధాన్యం పెరిగింది. కానీ ఇంతకాలం ఏదోఒక జాతీయ రాజకీయపక్షం నీడ లో అధికారం పంచుకోవలసి వచ్చేది. కేంద్రంలో భాగస్వామ్యపక్షాలు అయినప్పటికీ, ప్రాంతీ య ఆకాంక్షలకు ప్రాధాన్యం లభించేది కాదు. దీంతో ప్రాంతీయపక్షాలు ఆత్మగౌరవంతో అధికారాన్ని పంచుకోవాలని, తామే నాయకత్వ స్థానంలో ఉండాలని కేసీఆర్ భావించారు. దేశం ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం సూచించేదిగా ప్రాంతీయపక్షాల అజెండా ఉండాలని కూడా సూచించారు. ఈ క్రమంలో కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదన మూలంగా ప్రాంతీయ పక్షాలలో ఆత్మవిశ్వాసం ఇనుమడించింది. కొన్ని ప్రాంతీయపార్టీలు ఏ కూటమిలో చేరక ఎన్నికల అనంతర రాజకీయాలను శాసించడానికి సిద్ధపడుతున్నాయి. మరికొన్ని ఏదోఒక సంకీర్ణంలో చేరినప్పటికీ, ఎన్నికల అనంతర పరిస్థితిని బట్టి క్రియాశీలంగా మారడానికి సిద్ధంగా ఉన్నాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నికల ప్రక్రియ వ్యాపారుల క్రీడగా మారింది. వ్యాపారులు స్వయంగా రాజకీయాల్లోకి ప్రవేశించడం లేదా తెరవెనుక ఉండి శాసించడం సాగేది. విలువల విధ్వంసం కూడా పెద్ద ఎత్తున సాగింది. అన్ని రాజకీయపక్షాలు కూడా ఉమ్మడి రాష్ట్రంలో అలవాటుపడిన విధానాలను త్యజించి, ప్రజా సంక్షేమంతో ముడిపడిన రాజకీయాలను అనుసరించాలె. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్న నేపథ్యంలో మనం విలువలతో కూడిన రాజకీయాలకు పట్టం కట్టవలసిన బాధ్యత ప్రజల మీద ఉన్నది. దీంతో ఎన్నికల అనంతర రాజకీయాలపై అత్యంత ఆసక్తి వ్యక్తమవుతున్నది. దేశ రాజకీయాల్లో ప్రాంతీయపక్షాల ప్రాధా న్యం పెరుగడంతో బీజేపీ, కాంగ్రెస్ కొద్దిరోజులుగా రాష్ట్రాలవారీగా పొత్తులను కుదుర్చుకుంటున్నాయి. బీజేపీ పూర్వవైభవం పొందే పరిస్థి తి లేదు. ఎన్డీయే సీట్ల సంఖ్య భారీ తగ్గవచ్చు. మరోవైపు కాంగ్రెస్ పుంజుకునే సూచనలు కనిపించడంలేదు. ఇప్పుడున్న 44 సీట్లకు అదనం గా ఎన్ని తెచ్చుకున్నా మెజార్టీ సాధించడం సాధ్యం కాదు. బీజేపీ పంజాబ్, మహారాష్ట్ర, బిహార్, తమిళనాడు తదితర రాష్ట్రాల్లో పొత్తులు కుదుర్చుకున్నది. కాంగ్రెస్ మహారాష్ట్ర, తమిళనాడులో పొత్తు కుదుర్చుకున్నది. కర్ణాటక, బిహార్‌లో అవగాహనకు వచ్చినా సీట్ల సర్దుబాటు కష్టంగా మారింది. ఎనభై సీట్లున్న ఉత్తరప్రదేశ్‌లో ఎస్పీ, బీఎస్పీ పొత్తు జాతీయపక్షాల భవితవ్యంపై ప్రభావం చూపుతున్నది. జాతీయ రాజకీయపక్షాలు జోరుగా పొత్తులకు దిగుతున్న నేపథ్యంలో టీఆర్‌ఎస్ ఫెడరల్ ఫ్రంట్ ప్రతిపాదన కు కట్టుబడి ఏ కూటమిలో చేరలేదు. మన రాష్ట్రంలో ఉన్న అన్ని లోక్‌సభ స్థానాలను గెలుచుకుంటే, జాతీయ రాజకీయాలను శాసించవచ్చునని, తద్వారా రాష్ట్ర ప్రయోజనాలను నెరవేర్చుకోవచ్చునని ముఖ్యమంత్రి కేసీఆర్ భావిస్తున్నారు. జాతీయ రాజకీయపక్షాలలో ఏ ఒక్క పార్టీకి పూర్తి మెజార్టీ లభించదని రాజకీయ విశ్లేషకులు దృఢంగా చెబుతున్నారు. అంతేకాదు ఎన్నికల ముందు ఏర్పడిన ఏ కూటమి కూడా పూర్తి మెజార్టీ సాధించకపోవచ్చునని అంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రతి ఒక్క ఎంపీ స్థానం కీలకమైనదిగా మారుతుంది. 17 లోక్‌సభ స్థానాలున్న తెలంగాణ ఢిల్లీలో చక్రం తిప్పడం సాధ్యమే. ఈ సారి తెలంగాణ, ఏపీలలో ఒకేరోజు పోలింగ్ జరుగడం విశేషం. ఉమ్మడి రాష్ట్రంలో కూడా ఈ విధంగా ఒకేరోజు పోలింగ్ జరుగలేదు. కొందరు ఓటర్లు రెండు రాష్ట్రాల్లో తమ పేరు నమోదు చేయించుకొని ఇక్కడా, అక్కడా ఓటు వేస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఇటువంటి దొంగ ఓటర్ల సంఖ్య భారీస్థాయిలో ఉన్నదనే అనుమానాలు కూడా ఉన్నాయి. ఒక రాజకీయపక్షం కుట్రపూరితంగా వ్యవహరిస్తున్న కారణంగానే, పెద్ద ఎత్తున రెండుచోట్ల ఓటర్లుగా నమోదైనట్టుగా కూడా ఆరోపణలున్నాయి. వీరిని తొలిగించడానికి ఆధార్‌ను అనుసంధానం చేయాలనే సూచనలు వచ్చినప్పటికీ, అది సాధ్యం కాలేదు. సంక్షేమ పథకాలు మొదలుకొని అవసరమైన చోటల్లా ఆధార్ అనుసంధానం సాగుతున్నది.

## ఘనంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ

# ఆవిర్భావ దినోత్సవాలు



ములగాడ: పారిశ్రామిక ప్రాంతంలో 45 వార్డు వార్డు ఏకేసీ కొనలి లో వైఎస్ఆర్సిపి వార్డు అధ్యక్షులు గుండపు నాగేశ్వరావు ఆధ్వర్యంలో మంగళవారం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ 8 వసంతాలు పూర్తిచేసుకుని 9 వసంతంలో పార్టీ అడుగుపెట్టడం వలన వైఎస్ఆర్ పార్టీ నాయకులు ఆనందంతో ఈ ఆవిర్భవ దినోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు ఇదే తరహాలో 49 వ వార్డు మల్కాపురం ఆంజనేయ స్వామి ప్రధాన కూడలి వద్ద వార్డు అధ్యక్షులు పిలక రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఎగరేస్తూ జై జగన్ జై జగన్ అంటూ నినాదాలు చేశారు అనంతరం నాయకులు అందరూ కలిసి ఇ కేకును కట్ చేసి అందరికీ పంచిపెట్టారు ఇందులో భాగంగా 48 వ వార్డు ప్రకాష్ నగరంలో వైయస్సార్ పార్టీ కార్యాలయం నందు వార్డు అధ్యక్షులు జి వి ఎస్ ఎన్ రాజు ఆధ్వర్యంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా జరుపుకున్నారు ముందుగా వార్డు అధ్యక్షులు చేతుల మీదగా వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లు అర్పించి పార్టీ జెండాను ఎగరవేశారు అనంతరం వైసిపి నాయకులు శరగడం పత్ని రావు మళ్ల ధనలత వార్డు అధ్యక్షులు రాజు మాట్లాడుతూ ఎప్పటి వరకు తెలుగుదేశం పార్టీ రాక్షస పాలనతో ప్రజలను మోసగించారని రానున్న ఎన్నికల్లో రామ పాలన రావాలంటే జగన్ ముఖ్యమంత్రి కావాలని తెలుగుదేశం పార్టీ పేదలకు సంక్షేమ పథకాలు అందకుండా తెలుగుదేశం పార్టీ నాయకులు దోచుకున్నారని దీన్ని దృష్టిలో పెట్టుకొని జగనన్న నవరత్నాలు ప్రజల్లోకి తీసుకొని వెళ్లి పేద ప్రజలు అందరికీ అందేలా కృషి చేస్తున్నారని రానున్న ఎన్నికల్లో వైయస్ కాంగ్రెస్ పార్టీ విజయం లోకి వస్తే ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతాయని అన్నారు తెలుగుదేశం పార్టీ చేస్తున్న అవినీతిని అక్రమాలను ఇప్పటివరకు ప్రజలందరూ గమనిస్తున్నారని రానున్న ఎన్నికల్లో పార్టీకి సరైన బుద్ధి చెబుతారని అన్నారు ఈ కార్యక్రమంలో వైయస్సార్ పార్టీ నాయకులు వార్డ్ యూత్ ప్రెసిడెంట్ విజయ్ పిల్లా కన్నబాబు హనుమంతరావు సతీష్ గేదెల రమణ గణేష్ మిశ్రా మహేష్ సత్యవతి రమ సురేష్ తదితరులు పాల్గొన్నారు

## సౌత్ ఇండియా బాక్సింగ్ యూత్ వింగ్ అధ్యక్షుడిగా గుర్రాల రామారావు



ములగాడ: నేషనల్ ఫోరమ్ ఫర్ సోషల్ జస్టిస్ న్యూఢిల్లీ జాతీయ అధ్యక్షులు నెల్లి గురుదేవ్ జి విడుదల చేసిన నియామక పత్రాన్ని జై భీమ్ బాక్సింగ్ క్లబ్ వ్యవస్థాపకుడు అంతర్జాతీయ బాక్సింగ్ క్రీడాకారుడు గుర్రాల రామారావు ను సౌత్ ఇండియా బాక్సింగ్ యూత్ వింగ్ అధ్యక్షుడిగా నియామక పత్రాన్ని విడుదల చేశారు ఇదేవిధంగా విశాఖ జిల్లా లా ఎస్సీ యూత్ వింగ్ అధ్యక్షుడు చంద్రశేఖర్ సాహూ కూడా నియమించినట్లు ఉత్తర్వులు జారీ చేశారు ఇందులో భాగంగా శ్రీహరిపురం లో మంగళవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా నేషనల్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ఆంధ్ర రాష్ట్ర బాక్సింగ్ సీనియర్ కోచ్ సౌదా జిల్లా కోఆర్డినేటర్ వెంకటేశ్వరరావు నియోజకవర్గ కన్వీనర్ కొల్లి నూకరెడ్డి వారి చేతుల మీదగా పత్రాలను అందజేశారు అనంతరం వారు మాట్లాడుతూ ఇచ్చిన పదవులను వ్యక్తిగత సమాజంలో గుర్తింపుతో పాటు బాధ్యతలు పెంచుతామని మా సంస్థ కేరళ ఆంధ్ర తెలంగాణ తో పాటు దేశవ్యాప్తంగా విస్తరిస్తుందని దళిత బడుగు బలహీన వర్గాలకు అభ్యున్నతికి రూపుమాపేందుకు చట్ట న్యాయపరమైన అంశాలతోపాటు సామాజిక విషయాలపై అవగాహన కల్పించి సమాజాన్ని చైతన్య వంతులు చేయటమే ధ్యేయం అని అన్నారు ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ ఎఫ్ జె హుమన్ విశిగ్ అధ్యక్షులు రౌతు రాధ ఇండస్ట్రియల్ ఎస్సీ యూత్ వింగ్ అధ్యక్షులు నా సుదర్శన్ పలువురు బాక్సులు ప్రతినిధులు పాల్గొన్నారు



శ్రీకాకుళం జిల్లా వైస్సార్సీపీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మరియు జిల్లా పార్టీ అధ్యక్ష పదవి బాధ్యతలు స్వీకరించిన శుభ సందర్భంగా ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమం0లో పాల్గొన్న డా..కిల్లి. కృపారాణి, ధర్మాన.ప్రసాదరావు,.తమ్మినేని.సీతారాం,.ధర్మాన. కృష్ణదాస్, .దువ్వాడ.శ్రీనివాస్, పిరియా సాయిరాజ్, పేడాడ తిలక్, చింతాడ మంజు, నర్తు రామారావు, జిల్లా వైస్సార్సీపీ నేతలు, పెద్దలు ,వైస్సార్సీపీ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు



*ఎన్నికల వేళా విశాఖ దక్షిణ నియోజకవర్గంలో సమస్యాత్మక ప్రాంతాలపై దృష్టి సారించడానికి విశాఖ యువజన అధ్యక్షులు కొండా రాజీవ్ గాంధీ గారిని అయన కార్యాలయంలో కలుసుకున్న పోలీసులు. ఈ సందర్భంగా వారితో కొండా రాజీవ్ గాంధీ గారు మాట్లాడుతూ ఈ ఎన్నికల సమయంలో పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని తద్వారా ప్రజాస్వామ్య విలువలు కాపాడాలను కోరారు.*

## గీతం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం

సాగర్‌నగర్ : స్థానిక ఎండాడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఫార్మశీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిభిరం మంగళవారం గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ ప్రారంభించారు. ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మశీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.గణపతి మాట్లాడుతూ యువత సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా మానవ సంబంధాల ప్రాధాన్యతను అర్దం చేసుకోవాలన్నారు.ఏ రంగంలో ఉన్నా సమాజం పట్ల బాద్యాతను మరవకూడదన్నారు.

కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్‌స్ వైద్య బృందం ఆద్వర్యంలో పాఠశాల విద్యార్థులతో పాటు 216 మంది స్థానికలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను సహితం ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ జి.వీరేశ్వరస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ సుమంతో మండల్ ,100 మందికి పైగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గోన్నారు.

## విజ్ఞాన్ విద్యార్థులు బాస్కెట్ బాల్ ప్రతిభ



భీమునిపట్నం : మార్చి 8 నుంచి 10 వ తేదీ వరకు సాగర్ నగర్ లో సాగర్ స్పోర్ట్స్ అసోషియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాస్కెట్ బాల్ టోర్నమెంట్ లో విజ్ఞాన్ విద్యాలయం (తిమ్మాపురం) విద్యార్థులు విజయం సాధించారని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు శారీరక ధారుడ్యాన్ని,మానసిక స్థైర్యం ను పెంపొందిస్తాయని అన్నారు. ఈ పోటీలలో 16 పాఠశాలలు పాల్గొన్నాయని అందులో విజ్ఞాన్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ లావు రుద్రమదేవి,సి.ఇ.ఓ.పవన్ కృష్ణ, ఇ.డి. ఎన్. శ్రీకాంత్, ప్రిన్సిపాల్ కె.ప్రసాద్ చంద్ర లు విద్యార్థులను అభినందించారు.

## విశాఖ దక్షిణంలో రెపరెపలాడిన వైకాపా జెండా



దక్షిణ నియోజకవర్గంలోని పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సమన్వయకర్త డా. పైడి వెంకట రమణ మూర్తి పార్టీ జెండాను ఎగుర వేసి పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పార్టీ శ్రేణులంతా ఇదే ఉత్సాహంతో పని చేసి రానున్న రోజుల్లో జగనన్నను ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దక్షిణ నియోజకవర్గ అనుబంధ సంఘాల నాయకులు, వైకాపా అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భూకుంభకోణాల్లో టీడీపీది ప్రముఖ పాత్ర



### వైఎస్ఆర్ ఆశయ సాధన కోసమే వైకాపా ఆవిర్భవించింది

### ప్రజా పోరాటాల్లో వైకాపాదే మొదటి స్థానం



మద్దిలపాలెం: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారం చేపట్టాక సీఎం చంద్రబాబు నాయుడు, ఆయన కొడుకు లోకేష్ మరియు రాష్ట్ర మంత్రులు కలిసి భూకుంభకోణాలకు నాందిపలికారని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు డా. మళ్ళ విజయప్రసాద్ ధ్వజమెత్తారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 8వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పార్లమెంటరీ నియోజకవర్గ సమన్వయకర్త ఎంవివి సత్యనారాయణ, పార్లమెంటరీ అధ్యక్షుడు తైనాల విజయకుమార్, నగర సమన్వయకర్తలు, నాయకులు, అభిమానులతో పార్టీ జెండాను ఎగురవేసి ఆవిర్భావ వేడుకలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డా. మళ్ల విజయప్రసాద్ మాట్లాడుతూ తెలుగుదేశం పాలనలో రాష్ట్రంలో అవినీతి రాజ్యమేలుతోందని, ఎక్కడ చూసినా భూకుంభకోణాలు, ఇసుక మాఫియా, లిక్కర్ మాఫియాలతో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని మళ్లా విజయప్రసాద్ ఆరోపించారు. భారత రాజ్యాంగంలో ప్రతీ పౌరునికీ వ్యక్తిగత సమాచారాన్ని భద్రపరుచుకునే హక్కు ఉందని అత్యున్నత న్యాయస్థానం చెప్పిందని, న్యాయస్థానాల తీర్పులను ఉల్లంఘించి ఆధార్, బ్యాంక్ అకౌంట్, మరియు వ్యక్తిగత సమాచారాన్ని తమ స్వప్రయోజనాలకోసం ప్రైవేట్ వ్యక్తులకు అందించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ప్రజా సమస్యలే ఎజెండాగా భావించి అధినేత ఆశయాలకు అనుగుణంగా పోరాటాలు చేస్తున్నామని ఆయన తెలియజేశారు. నేడు రాష్ట్రంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలమైన పార్టీగా రూపాంతరం చెందిందని, రానున్న రోజుల్లో ప్రజల మద్దతు కూడగట్టుకుని జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో పరిపాలన సాగిస్తామని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు రొంగలి జగన్నాథం, జాన్ వెస్లె, కొయ్య ప్రసాదరెడ్డి, సత్తి రామకృష్ణా రెడ్డి, రవిరెడ్డి, నగర పార్లమెంటరీ అధ్యక్షురాలు పీలా వెంకట లక్ష్మి, నగర సమన్వయకర్తలు కెకె రాజు, డాక్టర్ పైడి వెంకట రమణ మూర్తి, పేర్ల విజయ చంద్ర, నగర అధ్యక్షురాలు గరికిన గౌరి, నగర యువజన విభాగం అద్యక్షుడు కొండా రాజీవ్ గాంధీ, జోగినాయుడు, కృష్ణంరాజు, రామన్నపాత్రుడు, రెయ్యి వెంకట రమణ, బోస్, శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోజుకి రూ. 25/- మాత్రమే Size 1x3 Minimum 7 days విజయభాను క్లాసిఫైడ్స్ సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

# ఘనంగా పోలమాంబ పండుగ



పరవాడ: పరవాడ మండలము ఇ.బోనంగి పంచాయితీ పరిదిలో వెలసిన పోలమాంబఅమ్మవారిపండుగను మంగళవారము అంగరంఘ వైభవంగా నిర్వహించారు. భక్తులు వేకువజామునుండి అమ్మవారిని దర్శించుకొనిప్రత్యేకపూజలు చేసారు. స్ధానిక శాసన సభ్యులు బండారు సత్యనారాయణమూర్తి, జడ్పిటిసి సభ్యులు పైల జగన్నాదరావు,మాజీసర్పంచ్లు గొర్లికనకారావు, అట్టా సన్యాశి అప్పారావు, మాజీఉపసర్పంచ్ బుగిడిగోవింద,వర్రి పరిదేశి నాయుడు తథితర్లు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరమూఏర్పాటు చేసినసంస్కృతి కార్య క్రమాలు ప్రజలును ఏంతగానో అకట్టుకున్నాయి. ఈ కార్య క్రమంలో పోలమాంబగుడిచైర్మన్ బుగిడిరమణ, బొండా సన్ని దేముడు,బొద్దపురమణ,శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఇగ్నోలో పి.హెచ్.డి./ఎమ్.ఫిల్ ప్రవేశాల ప్రకటన

విశాఖపట్నం : ఇగ్నోలో జూలై 2019కి పి.హెచ్.డి./ఎమ్.ఫిల్. ప్రవేశాలకోసం ప్రకటన జారీ అడ్మిషన్లకోసం ప్రవేశ పరీక్ష నిర్వహణ ఏప్రిల్ 7వతేదీన దరఖాస్తులు సమర్పించడానికి చివరి తేదీ ఈనెల 25. ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) జూలై 2019 నుండి ప్రారంభమయ్యే వివిధ సబ్జెక్టులలో ఎమ్.ఫిల్. మరియు పి.హెచ్.డి.కోర్సులలో అడ్మిషన్ల కోసం ప్రవేశ ప్రకటన జారీ చేసింది. ఈ పరిశోధనా కోర్సులు రెగ్యులర్ విధానం ద్వారానే నిర్వహించబడతాయి. కెమిస్ట్రీ (రసాయన శాస్త్రం), వాణిజ్య శాస్త్రం (కామర్సు), జర్నలిజం మరియు మాస్ కమ్యూనికేషన్, ట్రాన్సులేషన్ స్టడీస్ (అనువాద అధ్యయనం) విషయాలలో ఎమ్.ఫిల్. కోర్సులు, బయో కెమిస్ట్రీ, కెమిస్ట్రీ, కామర్సు, ఇంగ్లీషు, ఎడ్యుకేషన్, పర్యావరణ శాస్త్రం (ఎన్విరాన్ మెంట్ సైన్సు), లలిత కళలు (ఫైన్ ఆర్ట్సు), జెండర్ మరియు అభివృద్ధి అధ్యయనం, భూగర్భ శాస్త్రం (జియాలజీ), హిందీ, జర్నలిజం మరియు మాస్ కమ్యూనికేషన్, మేనేజ్‌మెంట్, సంగీతం, గ్రామీణఆభివృద్ధి, సోషల్ వర్కు, గణాంక శాస్త్రం (స్టాటిస్టిక్సు). ట్రాన్సులేషన్ స్టడీస్ (అనువాద అధ్యయనం), మహిళా అధ్యయనం (ఉమెన్ స్టడీస్) వంటి విషయాలలో పి.హెచ్.డి. కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులన్నీ భారతప్రభుత్వ విశ్వవిద్యాలయ నిధుల సంఘం (యు.జి.సి), న్యూఢిల్లీ వారి పి.హెచ్.డి/ఎమ్.ఫిల్. డిగ్రీల కనీసప్రమాణాలు, విధానాల నిబంధనలు-2016 ననుసరించి కచ్చితంగా వర్తింప చేయ బడ్డాయి. ఈ కోర్సులలో అడ్మిషన్లు ఏప్రిల్ 7వ తారీఖున నిర్వ హించబడే ప్రవేశ పరీక్ష ద్వారా ఇవ్వబడతాయి. ఈ ప్రవేశ పరీక్ష కోసం దరఖాస్తులు ఆన్‌లైను విధానం ద్వారా సమర్పించడాకిని చివరి తేదీ: 25 మార్చి 2019. దరఖాస్తులుఇక్కడ ఇవ్వబడిన లింకు ద్వారా సమర్పించడానికి ఇగ్నో వెబ్సైట్ చూడాలి. మరిన్ని వివరాలకు ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని సంప్రదించాలి. దరఖాస్తు చేయడానికి ఈనెల 25వ తేదీ గడువు అని తెలిపారు.

# బాస్కెట్ బాల్ పోటీల్లో నవీన్ ప్రతిభ



నాతవరం : ఉత్తరాంధ్ర జిల్లాల ఇంజనీరింగ్ విద్యార్థులకు గుడ్లవల్లూరులో నిర్వహించిన బాస్కెట్‌బాల్ పోటీల్లో నాతవరంకు చెందిన పైల నవీన్‌శ్రీసాయి అనే యువకుడు ప్రతిభ సాధించాడు. కాకినాడ కైట్ ఇంజనీరింగ్ కళాశాలలో సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ఈ పోటీల్లో కాకినాడ కైట్ ఇంజనీరింగ్ కళాశాల, విజయవాడ గుడ్లవల్లూరు ఇంజనీరింగ్ కళాశాల, విశాఖపట్నం రఘు ఇంజ నీరింగ్ కళాశాల, విజయనగరం ఎన్‌విజిఆర్ ఇంజనీరింగ్ కళా శాలల విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనగా మొదటి స్థానం కైట్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన పైల నవీన్‌శ్రీసాయి జట్టు విజయం సాధించింది. దీంతో ట్రోఫీతో పాటు నగదును అంద జేశారు. నాతవరం మండలానికి మంచి పేరు తీసుకురావడంతో నవీన్‌శ్రీసాయిని పలువురు అభినందించారు.

# రాజీవ్ గృహకల్ప కాలనీలో అవంతి ప్రచారం



మధురవాడ : మహా విశాఖ 5 వ వార్డ్ రాజీవ్ గృహకల్ప కాలనీలో మంగళవారం వైసీపీ భీమిలి నియోజకవర్గ అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాస్ (అవంతి శ్రీనివాస్) కార్యకర్తలతో కలిసి ప్రచారం చేసారు, వైసీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ముందుగా పార్టీ జెండా ఆవిస్కహరించి అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీచేశారు.

గతంలో తాను భీమిలి ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు, మరోసారి అవకాశం కల్పించాలని కోరారు.

ఈ కార్యాక్రమంలో వైసీపీ ఐదో వార్డ్ అధ్యక్షుడు పాతిన శ్రీను, జె ఎస్ రెడ్డి, పాతిన ఎల్లాజీ, గాదె రోశిరెడ్డి, నాయకులూ కార్యకర్తలు పాల్గొన్నారు.

# గాదె శ్రీనివాసులనాయుడుకు మద్దతుగా ప్రచారం

రోలుగుంట : పిఆర్‌టియు ఎమ్మెల్సీ అభ్యర్ధి గాదె శ్రీనివాసులనాయుడుకి మద్దతుగా సోమవారం మండలంలోని బుచ్చంపేట, కొంతలం పాఠశాలల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు విశాఖజిల్లా ప్రధాన కార్యదర్శి డిజి.నాథ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న శ్రీనివాసులనాయుడును గెలిపించుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రోలుగుంట మండలశాఖ అధ్యక్షులు జివి.రమణ, కార్యదర్శి శేషగిరి, సహాధ్యక్షులు బి.సూర్య నారాయణ, సభ్యులు డి.నానిబాబు, రమణ, అశోక్, వై.నర్సింహ మూర్తి, కృష్ణంరాజు, రాము, జి.రమణ పాల్గొన్నారు.

# కుండలేశ్వరం గ్రామంలో నలభై ఓట్లు తొలగింపు

**- తహసీల్దార్‌కు ఫిర్యాదుచేసిన సుబ్బరాజు..**

**- వ్యక్తిగతంగా ఓట్లను తొలగించిన వీఆర్వో?**



కాట్రేనికోన : కాట్రేనికోన మండలం కుండలేశ్వరం గ్రామంలో అన్యాయంగా తెలుగుదేశం పార్టీ కార్యకర్తల నలభై ఓట్లు తొలగించారంటూ కుండలేశ్వరం గ్రామస్థులు మంగళవారం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు ఆధ్వర్యంలో కాట్రేనికోన తహసీల్దార్ ప్రసాద్ కు పిర్యాదు చేశారు. అనంతరం తొలగించిన ఓటర్ల లిస్టును తహసీల్దార్ కు అందజేశారు. తొలగించిన ఓటర్లకు మళ్లీ ఓటు హక్కును కల్పించేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ దీనిపై విచారణ జరిపిస్తామని చెప్పారు. ఆరు నెలలు కుటుంబ సమేతంగా గ్రామం వదిలి వెళ్లిన వారికి స్థానికంగా ఓటు లభించదని, కుటుంబంలో ఒక్కరే ఇతర ప్రాంతాలకు వలస వెళ్లి కుటుంబ సభ్యులు స్థానికంగా నివసిస్తే వీరికి ఓటు హక్కు ఉంటుందని వివరించారు. తమ ఓటు హక్కును కోల్పోవడం చాలా భాధాకరమని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలో విఆర్‌ఓ తమ ఓట్లను వ్యక్తిగతంగా తొలగించారని గ్రామస్థులు విమర్శించారు. ఈ విషయమై తహసీల్దార్ ప్రసాద్ ను వివరణ కోరగా గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు ను పరిశీలిస్తామని అర్హత ఉండి తమ ఓటు తొలగిపోయినవారికి ఖచ్చితంగా ఓటు లభించే విధంగా చర్యలు తీసుకుంటామని మండల తహసీల్దార్ ప్రసాద్ హామీ ఇచ్చారు.

# జనసేన ఆవిర్భావ సభ విజయవంతం చేయాలి



సమావేశమైన జనసేన నాయకులు

నర్సీపట్నం : జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ ఈ నెల 14న రాజమండ్రిలో నిర్వహించ బోయే జనసేన పార్టీ ఆవిర్భావ సభను పురస్కరించుకొని నర్సీపట్నంలో మంగళవారం నర్సీపట్నం జనసేన నాయకులు సమావేశమయ్యారు. నర్సీపట్నం నియోజకవర్గం నుంచి ఐదు బస్సులు, 20 కార్లలో ఆవిర్భవ సభకు వెళ్లేందుకు నిర్ణయించారు.

జనసేన ఆవిర్భవ సభను విజయవంతం చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయ కులు గణేష్, మారిశెట్టి రాజా, ద్వారపూడి జగదీష్, అశోక్ బయపురెడ్డి, కొప్పాక కళ్యాణ్, వి.చక్రవర్తి, వాకా జాని, అల్లు నరేష్, కర్రి సురేష్, పి.నాయుడు, గుణశేఖర్, గొల్లపల్లి హరీష్, ఉగ్గిన గణేష్, తాతబాబు పాల్గొన్నారు.

## కస్తూరిబా పాఠశాలలో పని చేసున్న

# నాన్ టీచింగ్ ఉద్యోగుల కష్టం తీరేదెప్పుడు?

అరకులోయ : కస్తూరిబా పాఠశాలలో పని చేసున్న నాన్ టీచింగ్ ఉద్యోగుల కష్టం తీరే దెప్పుడు?......4 నెలలుగా అందని జీతాలు.....పట్టించుకోని అధికారులు.............అరకులోయ మన్యం కస్తూరిబా పాఠశాలలో పని చేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులకు 4 నెలల నుండి జీతాలు ఇవ్వక ఎన్నో అవస్థలు పడి ఆవేదన చెందుతున్నామని పలువురు ఉద్యోగులు అంటున్నారు కనీసం వివరాలు కుడా చెప్పకుండా దాస్తున్నారు జీతాలు సార్ అని అడిగితే రేపు ఎల్లుండి అని కాలయాపన చేస్తున్నారు అంటున్నారు.కస్తూర్బా పాఠశాలలో పనిచేస్తూన్న ఉద్యోగులు 2 రకాలు టీచింగ్ నాన్ టీచింగ్ గా విడదీసి జీతాలు చెల్లిస్తున్నారు అంటున్నారు.టీచింగ్ ఉద్యోగులకు ఎస్.ఎస్.ఎ ఆఫీస్ వారు జీతాలు చెల్లిస్తున్నారు.నాన్ టీచింగ్ ఉద్యోగులకు అవుట్ సోర్సింగ్ విధానంలో జీతాలు చెల్లిస్తున్నారు అంటున్నారు.అయితే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించకుండా అవుట్ సోర్సింగ్ యాజమాన్యం వడ్డీ కోసం తమ సొంత ఖాతాలో జమ చేసి దాచుకుంటు నెలల తరబడి కాయిస్తున్నరు అంటున్నారు.ఇప్పటికే చాలీ చాలని జీతాలతో బాద పడుతు ఉద్యోగాలు చేస్తున్న నాన్ టీచింగ్ ఉద్యోగులకు కష్టాలు తప్ప ఉద్యోగం చేస్తూన్న సంతోషాలు లేవంటున్నారు.వీరి బాదలను కనీసం స్పందించకుండా ఎస్.ఎస్.ఎ అధికారులు స్పందించడం లేదంటున్నారు.

జీతాలు లేకుండా పని చెయ్యడం ఎంత కష్టామో అప్పులు చేసి జీవితం గడపాల్సి వస్తుంది అంటున్నారు.ఉద్యోగాలు చేస్తూన్న జీతాలు లేకుండా ఎలా బ్రతకాలి అంటున్నారు.టీచింగ్ ఉద్యోగులకు మాత్రం నెలకు జీతాలు పడుతుంది కాని నాన్ టీచింగ్ ఉద్యోగులుకు మాత్రం జీతాలు లేకుండా 4 నెలలు పూర్తయ్యి 5 నెల వస్తూన్న జీతాలు మాత్రం లేవని పలువురు ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

# సిఆర్‌పిఎఫ్ వాదనను సమర్ధించిన సీబీఎస్ఈ



విశాఖపట్నం : ఏడాది పొడవునా పుస్తకాలలో కుస్తీ పడుతూ అధిక శాతం ఒత్తిడిని ఎదుర్కొంటున్న సీబీఎస్ఈ విద్యార్థులకు సిలబస్ తగ్గించేలా చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం గత సంవత్సరంలో కేంద్రీయ విద్యాలయాలు, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, మానసిక తత్వ శాస్త్రవేత్తలు, సైకియాట్రిస్ట్‌లు, న్యూట్రిషనలిస్టులు, మేధావులు, యోగా నిపుణులు, వ్యక్తిత్వ నిపుణుల అభిప్రాయాలను సేకరించింది.

ఈ అభిప్రాయాలన్నింటిని ఒక నివేదికలా జాతీయ విద్యా పరిశోధన, శిక్షణా మండలి (ఎన్‌సిఈఆర్‌టి)కి అందిం చింది. మొత్తం రాష్ట్రవ్యాప్తంగా ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొండు శీతారాం నేతృత్వంలోని ఆయా జిల్లాల ఫోరం కన్వీనర్‌లు మరింత సమాచారాన్ని క్లుప్తంగా సేకరించి ప్రభుత్వానికి పంపారు. ఈ విద్యాసంవత్సరం (2019-20) లో 10-15 శాతం, అలాగే అంచెలంచెలుగా 2021-22వ విద్యాసంవత్సరానికి 50శాతం తగ్గిస్తూ సంచలన నిర్ణయం తీసుకోవడం అభినందించ విషయమని చైల్డ్‌రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు గొండు శీతారాం అన్నారు. ఈ కార్యక్రమంలో ఫోరం రాష్ట్ర సభ్యురాలు బి.శకుంతల, జిల్లా జనరల్ సెక్రటరీ జె.వి.కుమార్, మహిళా కోకన్వీనరు జె.సత్యవతి, కార్యదర్శి కె.ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీలో వంద మంది చేరిక



భీమునిపట్నం : భీమిలి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త అవంతి.శ్రీనివాస్ మంగళవారం భీమిలి మండలం నిడిగట్టు గ్రామం, కాపులుప్పడ పంచాయతీ సొమ్మనపాలెం లో వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆత్మీయ సమావేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. అవంతి కి అక్కడ ప్రజలు ఘణ స్వాగతం పలికారు అనంతరం టిడిపి సినియర్ నాయుకులు పాల నాయుడు ఆద్వర్యంలో సుమారు వంద మంది వై.సి.పి, లో చేరారు.వారికి వై.సి.పి. సమన్వయ కర్త ముత్తం శెట్టి.శ్రీనివాసరావు వైసిపి కండువాలు వేసి పార్టీ లోకి ఆహ్వా నించారు. అనంతరం అవంతీ మాట్లాడుతూ గంటా శ్రీనివాసరావు ఐదు ఏళ్ళ పరిపాలనలో అంతా అవినీతి తప్ప ఎక్కడ అభివృద్ధి లేదని ఈ ఐదు ఏళ్ళ లో ఒక్క నిరుపేద కుటుంబానికి ఇల్లు మంజూరు చేయలేని దౌర్భాగ్య స్థితి లో ఈ రాష్ట్రం ఉందని అదే వై.సి.పి. హయం లోకి వస్తే ప్రతీ పేదవానికి ఇల్లు ఇస్తా మని,స్థానికులకే ఉద్యోగాలు కలిపిస్తామని అక్కడ యువతకు ఆయన హామీ ఇచ్చారు. ఇందులో వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు వేంపాడ శ్రీనివాస రెడ్డి, పెదబాబు, ఏడుకొండలు, ఎర్ను.అప్పలకొండరెడ్డి,జగన్నాద అప్పారావు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

**పాసుపోర్టు పోయినది**

నేను సీరం సునీత శ్రీరాములు, RTC కాంప్లెక్స్ రోడ్డు, విశాఖపట్నం నందు నడుస్తుండగా నా పాస్‌పోర్టు పడిపోయినది. పాస్‌పోర్టు నెంబరు : N6108467 తేదీ : 01.2.2016; Valid upto 31.1.2016 పోయినది. ఎవరికైనా దొరికినట్లయితే ఈ క్రింది చిరునామాకు దయచేసి అందజేయగలరు.

నా అడ్రస్
సీరం సునీత శ్రీరాములు
D/o. S.రామకృష్ణ,
డోర్.నెం.50-83-34/2, చంద్ర ఎన్‌క్లేవ్,
మధురానగర్, B.V.K. కాలేజి ప్రక్కన,
సీతంపేట, విశాఖపట్నం-16.

# మళ్లీ చంద్రబాబునాయుడు సీఎం కావాలి



సబ్బవరం : సబ్బవరం మండలం నాయీ బ్రాహ్మణ సమస్యలపై ఆంధ్రప్రదేశ్ నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి విశాఖ అర్బన్ తెలుగుదేశం పార్టీ కార్యదర్శి నరవ పైడిరాజు మాట్లాడుతూ సెలూన్ షాపు నిమిత్తం 150 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తుందని, దాని ప్రతి ఒక్క నాయీ బ్రాహ్మణులు కూడా చక్కగా ఉపయోగించుకోవాలని, ఆంధ్ర రాష్ట్రంలో సంగీత పాఠశాలకి అమరా వతిలో ఐదెకరాల స్థలం, పదికోట్ల రూపాయలు కేటాయించిన గౌరవ నీయులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తప్పకుండా ఆంధ్రప్రదేశ్‌లో ప్రతి ఒక్క నాయీ బ్రాహ్మణ కూడా రుణపడి ఉండాలని ఆయన్ని ముఖ్యమంత్రిగా చేసే బాధ్యత మీ అందరిపై వుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ అధ్యక్షులు కింతాడ త్రినాధ్, శ్రీను, కింతాడ అప్పారావు, కురువాడ రాజు తదితరులు పాల్గొన్నారు.

# గుండెల్లో రైళ్ళు : ఎమ్మెల్సీ రామారావు




విశాఖపట్నం : 2019 ఎన్నికల్లో విశాఖ ఉత్తర నియోజకవర్గం నుండి నారా లోకేష్ అభ్యర్థిగా ప్రకటించడంపై తెలుగు తమ్ముళ్ళ సంబరాలు 39వవార్డు బిర్లా జంక్షన్ ఎన్టీఆర్ విగ్రహం వద్ద నగర టీడీపీ అధికార ప్రతినిధి సనపల పాండురంగారావు ఆధ్వర్యంలో లోకేష్‌కు ఉత్తరం సీటు కేటాయించినందుకు సంతోషంగా కార్యకర్తల హర్షధ్వనుల మధ్య సంబరాలు జరుపుకుని అనంతరం కేక్‌ను ముఖ్య అతిధి ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు చేతుల మీదుగా కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా దువ్వారపు రామారావు మాట్లాడుతూ విశాఖ ఉత్తర నియోజక వర్గంలో మంత్రివర్యులు నారా లోకేష్ పేరు ప్రకటించడం చాలా ఆనందకరమైన విషయం. ఇప్పటికే యువతి, యువకులు సంతోషంగా ఉన్నారు. ప్రధానంగా విశాఖలోని లోకేష్ పోటీ చేయడం విశాఖకు పరిశ్రమలు ఐటీ కంపెనీలు, విశాఖ అభివృద్ధి, యువతీ, యువకులకు ఉద్యోగాలు కల్పించడం వంటి లోకేష్‌ని విశాఖ ఉత్తరం నియోజకవర్గ ప్రజలు స్వాగతిస్తూ అత్యధిక మెజార్టీతో గెలిపిస్తారని ఆశిస్తున్నారు. ఈ కార్యక్రమంలో నగర టీడీపీ అధికార ప్రతినిధి సనపల పాండురంగారావు, తెలుగు యువత కార్యదర్శి మూల రాము, తెలుగుదేశం నాయకులు పి.జాన్, సిహెచ్.సూర్యం, వి.శ్రీనువాస చక్రవర్తి, పి.ఆదినారాయణ, మూల యోగారావు, జి.దీపుకుమార్, జి.ఈశ్వరరావు, అధిక సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

## విశాఖ ఉత్తరంలో వైకాపా వ్యవస్థాపక దినోత్సవం



విశాఖపట్నం : వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించి 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మంగళవారం ఉత్తర నియోజక వర్గం వై కా పా కార్యాలయం వద్ద సమన్వ యకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి సనపల చంద్రమౌళి, సరగడము చిన్న అప్పారావు, పామొటీ బాబ్జీ,సేనాపతి అప్పారావు, పీలా వెంకటలక్ష్మి, వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ కుటుంబ సభ్యులు రాష్ట్ర, పార్లమెంట్, సిటీ,నాయకులు, వార్డు అధ్యక్షులు,అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తర వైకాపాలో నూతన నియమాకాలు



విశాఖపట్నం : వై.యస్.ఆర్.కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన విభాగం జాయింట్ సెక్రటరీగా నంబళ్ల రాజేష్, నగర యువజన విభాగం జెనరల్ సెక్రటరీగా అంబటి శైలేష్,నగర పబ్లిసిటీ జాయింట్ సెక్రటరీగా శివాజీ, నగర యువజన విభాగం జాయింట్ సెక్రటరీగా కె.జగదీశ్, నగర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా టి.కవిత రెడ్డి, నగర మైనార్టీ విభాగం సంయుక్త కార్యదర్శి షేక్ అబ్దుల్ ఖాదర్, నగర మహిళా విభాగం జాయింట్ సెక్రటరీగా మట్టా రాణి నగర యువజన విభాగం ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా పి.మణికంఠ, నియమితులయ్యారు. ఈ సందర్భంగా వీరు అందరూ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నంబళ్ల ఈశ్వరావు, పి.రాజు,మూర్తి, ధనుంజయ, పి.సంతోష్, సూర్య,రాధ,నాగమణి తదితరులు కలిశారు.

## ఘనంగా వైసీపీ ఆవిర్భావ దినోత్సవం



అనకాపల్లి ...స్థానిక రింగ్రోడ్డులో గల వైసీపీ కార్యాలయంలో వైసీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు వైసీపీ సమన్వయకర్త గుడివాడ అమర్నాథ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వానికి చరమగీతం పాడే సమయం ఆసన్నమైందన్నారు. వచ్చే ఎన్నికల్లో వైయస్ జగన్మోహన్ రెడ్డిని సీఎం చేసేందుకు వైసీపీ శ్రేణులతోపాటు రాష్ట్ర ప్రజలంతా ద ృఢ సంకల్పంతో ఉన్నారన్నారు. ఎన్నికలకు ఎక్కువ సమయం లేనందున ప్రతి ఒక్కరు ఈ నెలరోజులు శక్తివంచన లేకుండా పార్టీ విజయానికి క ృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మళ్ల బుల్లిబాబు, దంతులూరి దిలీప్ కుమార్, దాడి రత్నాకర్, మందపాటి జానకిరామరాజు,పలకా రవి, గొర్లి సూరిబాబు, బొడ్డపాటి చిన్నరాజారావు, కొణతాల మురళీక ృష్ణ, ఆళ్ల నాగేశ్వరరావు, పొలిమేర మురళీకృష్ణ, కోరుకొండ రాఘవ, జాజుల రమేష్, సూరిశెట్టి రమణ అప్పారావు, వేగి దొరబాబు, నంబారు రమణ, తదితరులు పాల్గొన్నారు.



టెక్కలి క్యాంపు కార్యాలయంలో మాజీ మంత్రి జిల్లా వైస్సార్సీపీ అధ్యక్షులు డా,కిల్లి.కృపారాణి ని కలిసి ప్రత్యేక అభినందలు తెలుపుతున్న పలాస మున్సిపాలిటీ వైస్సార్సీపీ నేతలు దువ్వాడ సోదరులు మరియు పలువురు నేతలు పాల్గొన్నారు.

# యానాంలో ప్రశాంత ఎన్నికలకు సహకరించండి

యానం : కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి పార్లమెంట్ స్థానానికి ఏప్రిల్ 18న జరగనున్న ఎన్నికలకు సంబంధించి యానం నియోజకవర్గంలో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగే విధంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని పరిపాలనాధికారి ఎన్నికల రిటర్నింగ్ అధికారి శివరాజ్ మీనా పిలుపు నిచ్చారు యానం నియోజకవర్గంలో వెరపాటు ఏర్పాటుచేసిన 36 పోలింగ్ బూతుల వద్ద కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టామన్నారు ప్రధాన కూడలి వద్ద 10 చెక్ పోస్టులు ఏర్పాటు చేసి పోలీస్ తో పాటు అధికారులను ఏర్పాటు చేయనున్నామన్నారు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 1950 టోల్ ఫ్రీ నెంబర్ ను సంప్రదించి ఎన్నికలకు సంబంధించిన సమాచారం పొందవచ్చన్నారు అదేవిధంగా ఫిర్యాదులు సైతం చేసుకోవచ్చన్నారు అన్ని చోట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఎప్పటికప్పుడు మోనిటరింగ్ సిబ్బంది వాటి పర్యవేక్షణలో ఉంటారన్నారు అదేవిధంగా యానం పరిపాలన అధికారి కార్యాలయం లోఎన్నికల కు సంబంధించిన ఏ సమాచారాన్ని నైనా పొందటానికి 0884 2325105 టోల్ ఫ్రీ నెంబర్ 24 గంటలు అందుబాటులో ఉంటుంది అన్నారు యానాం లో గతంలో జరిగిన ఎన్నికలు ప్రశాంతంగానే జరిగాయని ఒకట్రెండు పోలింగ్ బూత్ లు మినహా మిగతా పోలింగ్ బూత్ లో ప్రశాంత్ పోలింగ్ ఓటర్లు సహకారాన్ని అందించిన దాకలాలు ఉన్నాయి అన్నారు దీనికి సంబంధించి ఇప్పటికే పోలీస్ అజూం అధికారిని రచానా సింగ్ ,సహచర పోలీస్ఉన్న త ఆధికారులతో బందోబస్తు ఏర్పాటు పై చర్చించి ఏ విధమైన ఇవాంచనీయ సంఘటన లు చోటు చేసుకో కుండా కట్టు ద్దిట్ట మైన వెరపాటు లు చేపట్టినట్లు తెలిపారు

## ఓటర్లకు ఈవీఎంలపై అవగాహన సదస్సు...

యానం : కేంద్ర పాలిత ప్రాంతమైన యానం నియోజకవర్గంలో ఏప్రిల్ 18న జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు ఓటుహక్కు వినియోగంపై పోలింగ్ బూతుల వారీగాస్థానిక ఎన్నికల సెక్టార్ అధికారుల బృందం అవగాహన కల్పించే కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు ఇప్పటికే ఎన్నికలకు సంబంధించి అధికారులతో సమీక్ష సమావేశం పరిపాలన అధికారి శివారాజ్ మీన నిర్వహించారు అధికారులకు నిర్వహనకు సంబంధించిన బృందాలు గా అదనపు అదికారాలను కేటాయించారు ఫ్లైయింగ్ స్కేడ్ ,సెక్టర్ ఆఫీసర్లుగా ,బీ ఎల్ ఓ లు గా నియమించారు.

అనంతరం ఎన్నికల పై ఆధికారులకు అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు ఈ మేరకు నియోజకవర్గ పరిధిలోని 36 పోలింగ్ బూతులు లో ఎన్నికల నియమావళి ,ఓటు హక్కు వినియోగంపై అవగహన కార్యక్రమం చేప్పట్టారు.

# అనకాపల్లి ఎంపిగా కొణతాల



అనకాపల్లి ... మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ అనకాపల్లి పార్లమెంట్ సభ్యునిగానే పోటీ చేయాలని, ఆయన అభిమానులు విజ్ఞప్తి చేసారు. పట్టణంలోని రింగ్ రోడ్ కార్యాలయంలో మంగళవారం విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ, మాజీ కౌన్సిలర్ మడగల శ్రీను, ఎంపీటీసీ చదరం నాగేశ్వరరావు, గొల్లబాబు, ఆళ్ల రామచంద్రరావు, విలేకర్లతో మాట్లాడారు. ఏ పార్టీ నుండి పోటీ చేసినా, ఎంపీగానే పోటీ చేయాలని, వారు విజ్ఞప్తి చేసారు. ఉత్తరాంధ్ర సమస్యలపై ఉత్తరాంధ్ర చర్చావేదిక పేరుతో అనేక పోరాటాలు చేసిన కొణతాల పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైతేనే ఈ ప్రాంత ప్రజానీకానికి సేవ చేసే అవకాశం లభిస్తుందన్నారు. ఈనెల 14 న ఆయన ఏ పార్టీలో చేరేది ప్రకటిస్తారని ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా దానికి ఆయన అభిమానులుగా కట్టుబడి ఉంటామని చెప్పారు. అయితే ఎవరెవరో వచ్చి ఇక్కడ పోటీ చేస్తామని కొణతాల పోటీ చేయరని, తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. ఆయన ఏ పార్టీలో చేసిన ఎంపీగా పోటీ చేస్తే సునాయాశంగా విజయం సాదిస్తారని చెప్పారు. ఈ విషయాన్ని కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని ఎంపీగా పోటీ చేయాలని ఆయన అభిమానులుగా కోరడం జరిగిందని ఆయన మా అందరి మాటకు గౌరవమిచ్చి ఎంపీగా బరిలోకి దిగుతారని ఆశిస్తున్నట్లు వారు చెప్పారు.

## ఐదేళ్లు పేదల సేవకుడిగానేఉన్నా.. ఎప్పుడూ ఉంటా



విశాఖపట్నంః .. ఐదేళ్లు పేదల సేవకుడిగానే ఉన్నానని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఉద్ఘాటించారు. ప్రజాదర్బార్, డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాలతో నిరంతరం పేదల మధ్యలోనే ఉన్నానని స్పష్టం చేశారు. పేదల ప్రభుత్వానికే ప్రజలు పట్టం కడతారని వ్యాఖ్యానించారు. 26వ వార్డు - ప్రసాద్ గార్డెన్స్ నుంచి రెండో రోజు ప్రచారాన్ని ప్రారంభించారు. పేదల వాడల్లోనీ ప్రజలను కలుసుకున్నారు. మన అభివృద్ధి, మన సంక్షేమానికే అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు. ప్రసాద్ గార్డెన్స్, గాజులవీధి, పూర్ణామార్కెట్, బౌడారారోడ్, వెలంపేట తదితర ప్రాంతాల్లోని ప్రజలను కలుసుకున్నారు. వాడవాడలా ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. గత ఎన్నికల్లో ఎంతగానో ఆదరించి ఘన విజయం అందించారని గుర్తు చేశారు. ఐదేళ్లూ మీకు అందుబాటులో ఉంటూ మీ సమస్యలు పరిష్కరిస్తూ మీరు అడిగిన అభివృద్ధి పనులు పూర్తి చేశామని వివరించారు. మరోమారు.. ఆశీస్సులు అందించాలని కోరారు. రాష్ట్రాభివృద్ధి కోసం సిఎం చంద్రబాబు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. చరిత్రలో ఎన్నడూ లేని స్థాయిలో పేదలకు సంక్షేమ ఫలాలు అందించి వారి హృదయాల్లో నిలిచిపోయారని కితాబునిచ్చారు. పసుపు కుంకుమతో ఆడపడుచులకు అన్నలా మారారన్నారు. రాష్ట్రాన్నీ సర్వనాశనం చేయడానికి దొంగలు ఊళ్లపై పడ్డారని ఆందోళన వ్యక్తం చేశారు. మీ వాడల్లోకి వస్తే తరిమికొట్టా లని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో బుచ్చా రామురెడ్డి, పిల్లి వరలక్ష్మి రమణ, మున్నం బాలాజీ, ఫైజల్ రెహమాన్, బెహరా వెంకటరత్నం, ఆలేటి వేంకటవు, హనీఫ్, సూరి అప్పారావు, సింహాద్రిప్రసాద్, చింతకాయల వాసు, పాల్గొన్నారు.

## సెజ్ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**సిఐటియు నాయకులు రొంగలి రాము**




అచ్యుతాపురం : స్థానిక ఈఎస్ఐ డిస్పెన్సరీని 30 పడకల ఆసుపత్రిగా మార్చి సెజ్ కార్మికులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిఐటియు జిల్లా కార్యదర్శి రొంగలి రాము డిమాండ్ చేసారు .షీలానగర్ లో శంకుస్థాపన చేసిన ఈఎస్ఐ ఆసుపత్రిని నిర్మాంచాలిని కలక్టర్ కార్యలయం వద్ద తలపెట్టిన దర్నాకు మంగళవారం సిఐటియు అధ్వర్యంలో కార్మికులు తరలివెళ్లారు .ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ సెజ్ కార్మికుల నుండి ఈఎస్ఐ పేరుతో కోట్లాది రూపాయలు వసూలు చేస్తూ సరైన వైద్య సేవలు కల్పించడం లేదన్నారు .ఈఎస్ఐ ఆసుపత్రిని వెంటనే నిర్మించాలని ,ఆటో ,ముఠా ,భవన నిర్మాణ కార్మికులకు ఈఎస్ఐ సదుపాయం కలిపించాలన్నారు .ఈ కార్యక్రమంలో సెజ్,ఆటో ,,ముఠా కార్మికులు తదితరులు పాల్గొన్నారు .

## ఘనంగా వైసీపీ ఆవిర్బావ వేడుకలు



అన్నవరం : తూ.గో.జిల్లా అన్నవరం స్దానిక పెద్ద బజార్ సెంటర్ నందు వైసీపీ ఆవిర్బావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రాయవరపు.భాస్కరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒక్కడితో ప్రారంభమై ఒక చరిత్రను సృష్టిస్తూ 9వ వసంతంలోకి ప్రవేశించి రానున్న అసెంబ్లీ ఎన్నికలలో చరిత్ర సృష్టిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ ఉపాధ్యక్షుడు తాడి.సత్యనారాయణ, కొండపల్లి. అప్పారావు,దడాల.సతీష్, తాటిపాక.కృష్ణ, ఆర్లి.సూరిబాబు, ధారా.వెంకటరమణ, గణేశుల.బాబ్జి,కొల్లు. చిన్న,కొల్లు. గణేష్, కొండి.ప్రకాష్, గుల్లా.దాసు, తాటుపాక. శ్రీను, చిట్రా.చంద్రరావు,పలివెల.కొండలర్రా, గుల్లా.ఆనంద్, ఇండుగబల్లి. సత్తిబాబు, మెరపల. చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి విద్యార్థులకు కలములు, ప్యాడ్లు పంపిణీ



అన్నవరం.....తూ.గో.జిల్లా స్దానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు కొండా.వేణుగోపాలరావు(వేణు మాష్టారు),సత్య ప్రసాద్ అను ఇరువురు అన్నదమ్ములు వారి అన్నగారైన కీ.శే.కొండా శ్రీనివాసరావు సంస్మరణార్ధము పదవ తరగతి విద్యార్ధులకు రేపు జరగబోయే పబ్లిక్ పరీక్షలకు ఉపయోగపడేందుకు కలములు,ప్యాడ్ లు,స్కేల్స్ పంపిణీ చేసారు.ఈ సందర్భంగా వేణు మాష్టారు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో రవి మాష్టారు, ప్రసాద్,శారదా,సీతామహాలక్ష్మి,సుధ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వైసిపిజెండా అవిష్కరణ

**ముఖ్యఅతిథిగా వార్డు అద్యక్షులు బట్టు**



పరవాడ:వైస్సార్ కాంగ్రెస్ పార్టీ 9వ వసంతంలోకి అడుగు పెట్టిన సందర్భంగా 55వ వార్డులోని సెక్టార్% 11లో వార్డ్ అధ్యక్షులు బట్టు సన్యాసిరావు గారి ఆధ్వర్యంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరముఅయన మాట్లడుతూరానున్న రాజ్యంజగన్ అన్నరాజ్యమనీ, రాష్ట్రముఅబివృద్ది చెందాలంటేజగన్ అన్నతోనే సాద్యపడతుందనీ ఈసందర్భంగాఅయన అన్నారు.ఈ కార్యక్రమంలోవైయస్ అర్ టియుసి జనరల్ సెక్రటరీ వై.మస్తానప్ప, సి. అప్పారావు, యస్ యస్ రెడ్డి, ఏ. పి. సారధి, వర్మ, బి.వి. స్.అప్పారావు, వెంకటేశ్వర్లు, అప్పలరెడ్డి, వినోద్ పలువురు పాల్గోన్నారు.

# 'సర్ఫ్ఎక్సెల్' యాడ్‌పై దుమారం



ప్రముఖ డిటర్జెంట్ సర్ఫ్ఎక్సెల్ బ్రాండ్ గురించి పెద్దలతో పాటు చిన్నపిల్లలకూ అందరికీ బాగా సుపరిచితం. టీవీలు, యుట్యూబ్‌ల్లో వచ్చే వాణిజ్య ప్రకటనల్లో ఎక్కువగా చిన్నపిల్లలతోనే సదరు సంస్థ యాడ్స్ రూపొందిస్తూ ఉంటుంది. తాజాగా హోళీ పండగను పురస్కరించుకొని యుట్యూబ్‌లో విడుదల చేసిన ప్రకటనపై దేశవ్యాప్తంగా దుమారం రేగుతోంది. కలర్ ఫుల్ పండగ హోళీని చిన్న పిల్లల నుంచి ముసలి వారి వరకు%. సినీ, రాజకీయ నాయకులు దగ్గర నుంచి సామాన్య జనం వరకు అందరూ ఆనందంగా జరుపుకుంటారు.

మత సామరస్యానికి ప్రతీకగా హిందూ బాలిక.. ముస్లిం బాలుడు నిమిషం నిడివిగల యాడ్‌లో నటించారు. హిందూ, ముస్లింల ఐక్యతను చూపుతూ రంగుల పండుగ హోళీ మతాలకతీతంగా అందరినీ దగ్గర చేస్తుందనే థీమ్‌తో సర్ఫ్ఎక్సెల్ ఈ యాడ్ చేసింది. దీనిపై సోషల్‌మీడియాలో భిన్నాభిప్రాయలు వ్యక్తం అవుతున్నాయి. హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా ఈ యాడ్ ఉందంటూ పలువురు నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**యాడ్‌లో ఏం ఉందంటే..**

హోళీ పండగతో హిందూ ముస్లింల సఖ్యతను చూపిస్తూ.. సమాజానికి మంచి సందేశం ఇచ్చే ప్రయత్నం చేశారు. ఈ యాడ్‌లో ముందుగా ఒక చిన్నారి(హిందూ) సైకిల్‌పై వస్తుంది. తనపై రంగులు వేయాలని అపార్ట్‌మెంట్ బాల్కనీల్లో ఉన్న పిల్లలను అడుగుతుంది. హోళీ సంబరాల్లో ఉన్న వారంతా ఆమెపై రంగుల బెలూన్లు విసురుతారు. అలా ఇంకా వేయండని చెప్తుంది. ఇలా పిల్లలందరూ రంగుల బెలూన్లు ఆమెపై విసురుతూనే వుంటారు.

వాళ్ల దగ్గర ఉన్న రంగులు అన్నీ అయిపోతాయి. అప్పుడు అక్కడే పక్క అపార్ట్‌మెంట్‌లో ఉన్న ముస్లిం బాలుడిని రమ్మని ఆ చిన్నారి పిలుస్తుంది. తెలుపు దుస్తులు ధరించిన బాలుడు వెంటనే వచ్చి ఆమె సైకిల్ వెనకాల కూర్చుంటాడు.

పైనున్న పిల్లలు అతనిపై రంగులు వేయటానికి ప్రయత్నిస్తారు కానీ రంగులు అయిపోతాయి. ఇంతలోనే బాల్కనీలో ఉన్న ఓ పిల్లాడు రంగులు చల్లబోతుంటే పక్కనున్న మరో చిన్నారి అడ్డుకుంటుంది. ఇక ఆ బాలుడు సంతోషంగా ఆమె సైకిల్‌పై మసీదు వద్దకు వెళ్తాడు.

మసీద్ లోపలికి వెళ్తూ.. నమాజ్ అయిపోయాక కలుద్దామని ఆ బాలుడు చెబుతాడు. దానికి ఆ చిన్నారి కూడా బయటకి వచ్చిన తర్వాత రంగులతో తడిసిపోవాల్సిందేనని అంటూ అక్కడి నుంచి వెళ్తుంది.

ఒక నిమిషం నిడివిగల ఈ ప్రకటనలో బ్యాగ్రౌండ్‌లో హిందూ సాంగ్ 'రంగ్ లాయే సంగ్' వస్తుంది. 'మంచి కారణం కోసం మరక అయితే.. ఆ మరక మంచిదే' అనే ట్యాగ్ లైన్‌తో యాడ్ ముగుస్తుంది. ప్రస్తుతం ప్రకటనపై నెటిజన్లు విపరీతంగా స్పందిస్తూ..ట్రోల్ చేస్తున్నారు.

# పెద్ద నోట్ల రద్దు దండుగ

## -దేశ ఆర్థిక వ్యవస్థకు దెబ్బ
## -నల్లధనాన్ని నిర్మూలించబోదు
## -ముందే మోదీకి చెప్పిన ఆర్బీఐ బోర్డు
## -ఆర్టీఐ సమాధానంలో రిజర్వ్ బ్యాంక్ వెల్లడి







న్యూఢిల్లీ, మార్చి 11: పాత పెద్ద నోట్ల రద్దు.. కేంద్రం తీసుకున్న ఈ సంచలనాత్మక నిర్ణ యం ప్రభావం ఇప్పటికీ అటు దేశ ఆర్థిక వ్యవస్థపై, ఇటు ప్రజలపై చూపుతున్న విష యం తెలిసిందే. నల్లధనం నిర్మూలనే ధ్యేయంగా 2016, నవంబర్ 8వ తేదీ రాత్రి రూ.500, 1,000 నోట్ల చలామణిని రద్దు చేస్తున్నట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్వయంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అనూహ్య నిర్ణయంతో దేశం యావత్తూ ఒక్కసారి ఉలిక్కిపడగా, తదనంతర పరిణామాలు సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురిచేస్తే.. వ్యాపార, ఆర్థిక రంగాల వ ృద్ధిని అడ్డుకున్నాయి. చివరకు ఏ నల్లధనాన్ని నిర్మూలించాలని పాత పెద్ద నోట్లను రద్దు చేశారో.. ఆ లక్ష్యం కూడా నెరవేరలేదు. అయితే ఇలా జరుగుతుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) బోర్డు డైరెక్టర్లు ముందే ఊహించారు. ఆ విషయాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి కూడా చెప్పారు. పాత పెద్ద నోట్లను రద్దు చేస్తున్నట్లు జాతినుద్దేశించి ప్రధాని నాటి రాత్రి 8 గంటలకు ప్రకటించగా, అందుకు రెండున్నర గంటల ముందు సాయంత్రం 5:30 గంటలకే అంతా వివరించారు. ఈ మేరకు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కార్యకర్త వెంకటేష్ నాయక్ దాఖలు చేసిన పిటీషన్‌కు ఆర్బీఐ తాజాగా తెలియజేసింది.

**నాటి బోర్డులో దాస్ కూడా..**

కేంద్రం తీసుకున్న పాత పెద్ద నోట్ల రద్దు నిర్ణయానికి ఆమోదం తెలిపేందుకు ఆర్బీఐ బోర్డు కీలక సమావేశం జరుగగా, ఇందులో అప్పటి ఆర్బీఐ గవర్నర్ ఊర్జిత్ పటేల్‌తోపాటు నాటి ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి, నేటి ఆర్బీఐ గవర్నరైన శక్తికాంత దాస్ కూడా ఉండటం గమనార్హం. వీరితోపాటు అప్పటి ఆర్థిక సేవల కార్యదర్శి అంజులి చిబ్ దుగ్గల్, ఆర్బీఐ డిప్యూటీ గవర్నర్లు ఆర్ గాంధీ, ఎస్ఎస్ ముంద్రాలున్నారు. ప్రస్తుత బోర్డులో గాంధీ, ముంద్రాలు లేని విషయం తెలిసిందే. ఇక కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ-ఆర్బీఐ విభేదాల మధ్య గవర్నర్ పదవికి పటేల్ రాజీనామా చేయడంతో గతేడాది డిసెంబర్‌లో దాస్‌కు ఆర్బీఐ సారథ్య బాధ్యతల్ని అప్పగించిన సంగతి విదితమే.

**మోదీ సర్కారు ఒంటెత్తు పోకడ: కాంగ్రెస్**

పాత పెద్ద నోట్ల రద్దు నిర్ణయాన్ని ఆర్బీఐ సరికాదన్నా.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం బలవంతంగా అమలు చేసిందని కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. ఈ విషయంలో ఆర్బీఐ ప్రభుత్వ వాదనల్ని విన్నదే తప్ప.. గట్టిగా వ్యతిరేకించలేకపోయిందని కూడా ధ్వజమెత్తింది. కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి జైరాం రమేశ్ సోమవారం ఇక్కడ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ పెద్ద నోట్ల రద్దుకు ముందు జరిగిన ఆర్బీఐ బోర్డు చివరి సమావేశం వివరాలను 28 నెలల తర్వాత వెల్లడించారన్నారు. ఆర్టీఐ కార్యకర్త ఎప్పుడో పిటీషన్ వేస్తే.. ఇన్నాళ్లకు వివరాల్ని వెల్లడిస్తారా? అని దుయ్యబట్టారు.

**ఆర్బీఐ బోర్డు ఏం చెప్పింది?**

పాత పెద్ద నోట్ల రద్దుతో దేశ ఆర్థిక వ్యవస్థ ప్రభావితం అవుతుందని, వ ృద్ధిరేటు మందగిస్తుందని కేంద్రానికి ఆర్బీఐ బోర్డు స్పష్టం చేసింది. జీడీపీపై స్వల్పకాలిక ప్రతికూల ప్ర భావం పడుతుందని, ముఖ్యంగా వ్యాపార, ఆర్థిక రంగాలు కుంటుబడుతాయని పేర్కొన్నది. అన్నిటికన్నా నల్లధనం నిర్మూలన అన్నది వట్టి మాటగానే మిగులుతుందని హెచ్చరించింది. నిజానికి నల్లధనం నగదు రూపంలో లేదని.. బంగారం, రియల్ ఎస్టేట్ ఆస్తుల్లోనే దాగుందని మెజారిటీ ఆర్బీఐ డైరెక్టర్లు అభిప్రాయపడ్డారు.

ఒక్క మాటలో చెప్పాలంటే పాత పెద్ద నోట్ల రద్దు దండుగ పనిగా తేల్చిచెప్పింది. అయినప్పటికీ ద్రవ్య వ్యవస్థలో 86 శాతంగా ఉన్న రూ.500, 1,000 నోట్లను రద్దు చేసి, వాటి స్థానంలో కొత్తగా రూ.500, 2,000 నోట్లను మోదీ పరిచయం చేశారు. నోట్ల రద్దు సమయంలో చలామణిలో రూ.15.41 లక్షల కోట్ల విలువైన రూ.500, 1,000 నోట్లున్నాయి. వీటిని బ్యాంకులు, పోస్టాఫీసుల్లో డిపాజిట్ చేసి, కొత్త నోట్లను తీసుకోగా, తిరిగి వచ్చిన నోట్ల విలువ రూ.15.31 లక్షల కోట్లుగా ఉందని ఆర్బీఐ అనంతరం తెలియజేసిన విషయం తెలిసిందే. కేవలం రూ.10,720 కోట్లు మాత్రమే తిరిగి రాలేదన్నది. దీంతో నోట్ల రద్దు విఫలమని చెప్పకనే చెప్పినైట్లెంది.

# ఒదిగి ఉండటమే ఇష్టం..!



అందాల ప్రదర్శన చేసేవాళ్లే ఎక్కువ అవకాశాల్ని అందుకుంటారనే మాటల్ని తాను విశ్వసించనని చెబుతున్నది మోహరీన్. ప్రతిభను నమ్ముకుంటేనే ఎక్కువకాలం సినిమాల్లో నిలదొక్కుకోగలమని అంటున్నది. కృష్ణగాడివీరప్రేమగాథతో తెలుగులో కెరీర్‌ను మొదలుపెట్టిన ఈ సొగసరి హ్యాట్రిక్ సక్సెస్‌లతో లక్కీస్టార్‌గా గుర్తింపును సొంతం చేసుకున్నది. మధ్యలో కొన్ని పరాజయాలు పలకరించిన ఎఫ్-2 చిత్రంతో తిరిగి పూర్వవైభవాన్ని దక్కించుకున్నది. పాత్రల ఎంపికలో ప్రస్తుతం తన ఆలోచన విధానం మారిందని చెబుతున్నది మెహరీన్. ఆమె మాట్లాడుతూ కెరీర్‌లో నిలదొక్కుకోవడానికి తొలినాళ్లలో అందాల ప్రదర్శనతో కూడిన పాత్రల్లో నటించాను. అలాగని గ్లామర్ విషయంలో ఏ రోజు హద్దులు దాటలేదు. ఓ పరిధి మేరకు గ్లామరస్‌గా కనిపించాను. ప్రస్తుతం నాలోని నటిని సంతృప్తిపరిచే సవాళ్లతో కూడిన పాత్రల కోసం ఎదురుచూస్తున్నాను. విజయాల వల్ల నా వ్యక్తిత్వంలో ఎలాంటి మార్పు రాలేదు. ఏమాత్రం గర్వం తలకెక్కలేదు. తొలి సినిమా సమయంలో ఎలా ఉన్నానో ఇప్పటికే అలాగే ఒదిగి ఉండటానికే ఇష్టపడతాను చెప్పింది.

# చిత్రభాను

## అవినీతిపై సమరం



సమాజంలోని అవినీతిని ప్రశ్నించే ఓ విద్యార్థి నాయకుడి జీవనగమనానికి ద ృశ్యరూపమే మా చిత్రం అని అన్నారు రాజా వన్నెంరెడ్డి. ఆయన దర్శకత్వం వహిస్తున్న చిత్రం ప్రశ్నిస్తా. మనీష్‌బాబు హీరోగా పరిచయం అవుతున్నారు. సత్యారెడ్డి నిర్మిస్తున్నారు. అక్షిత, హసీన్, షిప్రాకౌర్ కథానాయికలు. ఈ నెలాఖరున సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. దర్శకుడు మాట్లాడుతూ కమర్షియల్ హంగులతో సాగే సందేశాత్మక చిత్రమిది. యువతలో మార్పును తీసుకొచ్చేందుకు ఓ నాయకుడు ఎలాంటి మార్గాన్ని ఎంచుకున్నాడు? రాజకీయ ఒత్తిడులను ఎదుర్కొని తన లక్ష్యాన్ని ఎలా చేరుకున్నాడన్నది ఆకట్టుకుంటుంది. అంతర్లీనంగా అందమైన ప్రేమకథ మిళితమై ఉంటుంది. వెంగీ అందించిన బాణీలకు చక్కటి స్పందన లభిస్తున్నది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుతున్నాం అని తెలిపారు. రావురమేష్, ఆమని, వేణుగోపాల్, ప్రభాస్‌శ్రీను, అనంత్, శివపార్వతి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి కథ: పి. రాజేంద్రకుమార్, సంగీతం: వెంగీ, సినిమాటోగ్రఫీ: ఎన్.సుధాకర్‌రెడ్డి.

## అక్కాచెల్లెళ్ల కథ



అతుల్ కులకర్ణి, కబీర్‌దుహన్‌సింగ్, అర్చనాశాస్త్రి, అషిమా నర్వాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హారర్ థ్రిల్లర్ చిత్రం జెస్సీ. వి. అశ్వినీ కుమార్ దర్శకుడు. శ్వేతాసింగ్ నిర్మాత. ఈ నెల 15న విడుదలకు సిద్ధమవుతున్నది.

దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ ఇద్దరు అక్కాచెల్లెళ్ల నేపథ్యంలో సాగే కథ ఇది. వారి జీవితాల మీద నలుగురు ఘోస్ట్‌హంటర్స్ సాగించిన పరిశోధనలో ఏం తెలిసింది? జెస్సీ అనే ఆత్మ కారణంగా వారు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నదే చిత్ర కథ అన్నారు. పి.వి.ఆర్ సినిమాస్ ద్వారా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నాం.

థ్రిల్లర్ చిత్రాల్లో సరికొత్త జోనర్‌లో ఈ సినిమాను తెరకెక్కించాం అని నిర్మాత తెలిపారు. సంగీత దర్శకుడు శ్రీచరణ్ పాకాల మాట్లాడుతూ ఇదొక సైకలాజికల్ హారర్ థ్రిల్లర్. బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ బాగా కుదిరింది అన్నారు. ఈ చిత్రానికి మాటలు, పాటలు: కిట్టు విస్సాప్రగడ, సినిమాటోగ్రఫీ: సునీల్‌కుమార్ ఎన్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: అశ్వినీకమార్ వి.

## కలల సాఫల్యం కోసం..



ప్రతి ఒక్కరి హ ృదయాల్ని స్ప ృశించే కథాంశమిది. 36ఏళ్ల వయసులో తన కలను నెరవేర్చుకోవడానికి అర్జున్ అనే యువకుడు సాగించిన పోరాటం ఏమిటన్నదే చిత్ర ఇతివ ృత్తం. స్ఫూర్తివంతమైన కథతో అందరిని ఆకట్టుకుంటుంది అన్నారు గౌతమ్ తిన్ననూరి. ఆయన దర్శకత్వంలో నాని, శ్రద్ధశ్రీనాథ్ జంటగా నటిస్తున్న చిత్రం జెర్సీ. చిత్రీకరణ పూర్తయింది. ఏప్రిల్ 19న విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా నిర్మాత చిత్ర విశేషాలు తెలియజేస్తూ ఇటీవల విడుదల చేసిన రెండు పాటలకు అద్భుతమైన స్పందన లభించింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. నానిని సరికొత్త పంథాలో ఆవిష్కరించే చిత్రమిది.

భారీస్థాయిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం అన్నారు.

1996-97 రంజీట్రోఫీ క్రికెట్ నేపథ్యంలో చిత్ర కథ నడుస్తుంది. లక్ష్యసాధన కోసం ఓ క్రికెటర్ ప్రయాణానికి అడ్డం పడుతుంది. వేర్వేరు కాలవ్యవధుల్లో కథ నడుస్తుంది.

నాని పాత్ర భిన్న పార్శాల్లో సాగుతుంది అని దర్శకుడు తెలిపారు. సత్యరాజ్, రోనిత్‌శర్మ, బ్రహ్మాజీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సను వర్గీస్, ఆర్ట్: అనివాష్ కొల్లా, ఎడిటర్: నవీన్‌నూలి, సమర్పణ: పీడీవీ ప్రసాద్, కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వం: గౌతమ్‌తిన్ననూరి.

# జగన్ సీఎం కావాలి

### ఖాజా గరీబ్ నవాజ్ దర్గాలో చాదర్ సమర్పణ

### వైఎస్సార్సీపీ పార్లమెంట్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు బర్కత్ అలీ



కంచరపాలెం : విశాఖ వైఎస్సార్సీపీ పార్లమెంట్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు బర్కత్ అలీ విశాఖపట్నంలో ఉన్న పలువురు ముస్లిం పెద్దలతో కలిసి మంగళవారం (అజ్మీర్ ) షరీఫ్ వద్ద నున్న ఖాజా గరీబ్ నవాజ్ దర్గాలో చాదర్ (పవిత్ర వస్త్రం ) సమర్పించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల అయిన సందర్భంగా ఆంధ్ర ప్రదేశ్‌లో వైస్సార్సీపీ అధికారం లోకి రావాలని వైసీపీ అధినేత వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి ముఖ్య మంత్రి కావాలని కోరుతూ చాదర్ సమర్పించారు. అంతకు ముందు ముస్లిం మత పెద్దలు చాదర్‌కు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఈ సందర్భంగా బర్కత్ అలీ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ చాదర్ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరుగు తోందని 2019లో వైసీపీ అధికారంలోకి రావాలని జగన్ ముఖ్యమంత్రి కావాలని ప్రార్థనలు నిర్వహించామని అన్నారు. కార్యక్ర మంలో విశాఖపట్నం నుండి పలువురు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు .

# తుమూరు గెడ్డ జలాశయ విలాపం..

- పట్టించుకోని 'మహా' విశాఖ
- మంత్రి గంటా నియోజకవర్గంలో కానరాని ఆదరణ
- చెక్ డాంగా అవతరించి 40 వసంతాలు పూర్తి
- ఆచరణకు నోచుకోని ప్రతిపాదనలు

మధురవాడః ప్రకృతి సోయగాల నడుమ పచ్చని కొండల మధ్య పరవళ్లు తొక్కుతూ కిలోమీటర్ల మేర సుదీర్ఘ ప్రయాణం చేసే వర్షపు నీరు చివరగా కంబాలకొండ అటవీ ప్రాంతంలోనున్న తుమూరు గెడ్డ జలాశయం చెంతకు చేరుతుంది, అటు పీఎంపాలెం ఇటు బక్కన్నపాలెంకి సంమీపంలో ఉన్న ఈ జలాశయంను 1976 లో అప్పటి కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి జలగం వెంగళ రావు హయంలో అటవీ శాఖ, ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ సంయుక్తంగా నిర్మించాయి. ఈ జలాశయం ద్వారా సుమారు 6 వేలు ఎకరాల ఆయకట్టు భూములకు సాగు నీరు అందేది, కాలక్రమేణా పచ్చని పంటపొలాలు పోయి కాలొనీలు రావడంతో జలాశయం మరుగున పడింది, వర్షా కాలంలో నిండుకుండలా వుండే ఈ జలాశయం వేసవిలో ఎడారిగా మారుతోంది, నీరు చెట్టు లాంటి ప్రభుత్వ పథకాలు సైతం ఈ జలాశయంను ఆదుకోలేదు, సుమారు 200 ఎకరాలకు పైగా నీటి గర్భం వున్న ఈ జలాశయంను పరిరక్షించడం ద్వారా ప్రతియేటా కనీసం 10 కాలనీలకు నిరంతరం త్రాగునీరు అందించవచ్చునని అధికారులకు తెలిపినా పాలకులు స్పందించడంలేదు, సుమారు రెండు దశాబ్దాలనుండి చేస్తున్న అనేక ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమౌతున్నాయి తప్ప ఆచరణకు నోచుకోవడం లేదు, తుమూరు గెడ్డ జలాశయం అనేది ఒకటుందని అధికారులు, పాలకులు ఎప్పుడో మరిచిపోయారు, జలాశయంలోకి వచ్చే నీటిని శుద్ధిచేసి ప్రజలకు అందిస్తామని నాయకులూ



వాగ్దానాలు చేసినా పట్టించుకోకపోవడం విచారకరం, జలాశయం అడుగుభాగాన రాతి తాపడాలు అమర్చడంద్వారా నీటినిల్వలను పెంచవచ్చు అని ప్రతిపాదనలు ఉన్నా ఆ దిశగా చర్యలు చెప్పటడంలేదు. వేసవి రాకముందే కాలానిలలో మహిళలు ఖాళీ బిందులతో త్రాగునీటి కోసం పడుతున్న కష్టాలు వర్ణానాతీతం, వేళకాని వేళల్లో రొండు రోజుల కొకసారి నీటిని విడుదల చెయ్యడం వలన పనులకు, ఉద్యోగాలకు వెళ్లే మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల సమయంలో మాత్రమే నాయకులకు కనపడే కష్టాలు మరి తీరేదేప్పుడో, స్థానికుల విజ్ఞప్తి మేరకు కనీసం భావి తరాలకైనా తుమూరు జలాశయంను అందుబాటులోకి తెస్తారో లేక ఎప్పటిలాగే తీయ్యటి మాటలతో మాయ చేస్తారో వేచిచూడాల్సిందే.

### నౌకా నిర్మాణ కేంద్రంతో గీతం ఎంఓయు

# ఇంజనీరింగ్ విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ



సాగర్‌నగర్ : కేంద్ర నౌకా మంత్రిత్వ శాఖ సహకారంతో విశాఖ, ముంబై లలో ఏర్పాటైన సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మేరీటైమ్ మరియు షిప్ బిల్డింగ్ తో గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం మంగళవారం అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. నౌకా నిర్మాణ రంగంలో స్కిల్ డవలప్ మెంట్ నిమిత్తం ఇంజనీరింగ్ విద్యార్థులకు పలు డిప్లొమో, సర్టిఫికెట్ కోర్సులలో ఈ ఒప్పందంలో బాగంగా శిక్షణ అందించనున్నారు.

గీతం ఇన్ ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ సమక్షంలో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మేరీటైమ్ మరియు షిప్ బిల్డింగ్ ఛీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రియర్ అడ్మిరల్ శేఖర్ మిట్టల్, గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె.వి.జి.డి.బాలాజీ ఒప్పంద పత్రాలపై సంతకం చేశారు. ఈ సందర్భంగా రియర్ అడ్మిరల్ శేఖర్ మిట్టల్ మాట్లాడుతూ విశాఖ లోని ఎన్ఎస్‌డిఆర్‌సి లో 18 పై గా ప్రయోగశాలలు శిక్షణకు అనువైన విగా తీర్చిదిద్దామన్నారు. ఇంజనీరింగ్ విద్యార్థుల కోసం 9 డిప్లొమో కోర్సులు 50 సర్టిఫికెట్ కోర్సులను రూపొందించా మన్నారు. భారత దేశ నౌకా నిర్మాణ రంగంలో నిపుణుల కొరతను తీర్చడానికి అంతర్జాతీయ ప్రమాణాలతో శిక్షణ ఇస్తామన్నారు. ఇంజనీరింగ్ లో బిటెక్ తృతియ సంవత్సరం, ఎమ్‌టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారికి ఈ శిక్షణ పూర్తిచేసిన అనంతరం అర్హత సర్టిఫికెట్‌లను అందజేస్తామన్నారు.

గీతం ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కె.శివరామకృష్ణ మాట్లాడుతూ సాగరమాల వంటి జాతీయస్థాయి ప్రాజక్టులలో పనిచేయడానికి నూతన నైపుణ్యాలు అవసరమన్నారు.గీతం విద్యార్థులకు ముఖ్యంగా మెకానికల్, ఈసిఈ విభాగాలలో చదువుతున్న వారికి నౌకా నిర్మాణా రంగం, రోబోటిక్స్, మెకట్రానిక్స్ వంటి అంశాలపై శిక్షణ ఉపయోగపడు తుందన్నారు. కార్యక్రమంలో గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె.లక్ష్మీప్రసాద్, మెకానికల్ విభాగం అధిపతి ప్రొఫెసర్ ఎస్ నారాయణరావు, సెంటర్ ఫర్ ప్రాజెక్ట్ అండ కన్సల్టెన్సి డైరక్టర్ ప్రొఫెసర్ ఎమ్.ఆర్.ఎస్.సత్యానారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అప్పన్నను దర్శించుకున్న జీయరు స్వాములు



సింహాచలం : శ్రీ కృష్ణాపురం గోశాలలో సింహాచలం దేవస్థానం అత్యంతవైభవంగా నిర్వహిస్తున్న శ్రీ సుదర్శన నారసింహ మహ యాగశాల ప్రాంగణానికి త్రిదండి చినజీయరు స్వామి మంగళ వారం యాగశాలను సందర్శించారు. ఆయనవెంట త్రిదండి అహోబిలం రామానుజ జీయరు స్వామి కూడా యాగశాలకు విచ్చేశారు. యాగశాల ప్రాంగణానికి చేరుకున్న వీరికి సింహాచలం దేవస్థానం ఈ ఓ కె . రామచంద్రమోహన్ ఆలయ వైదికులు జీయర్ స్వామివారికి స్వాగతం పలికారు . స్వామిజీ యాగశాలను సందర్శించి జరగుతున్న కార్యక్రమాలను పర్యవేక్షించారు. .అనంతరం సింహాచల ఆలయ అనువంశిక దర్మకర్త పూసపాటి అశోకగజపతి రాజు కుటుంబీ కులు జీయరు స్వామివారికి పాదాభివందనం చేసి తీర్థప్రసాదములు స్వీకరించారు. అనంతరంస్వామివారు భక్తులను అనుగ్రహించి ఆశీర్వదించినారు. ఈ కార్యక్రమంలో ఆయనవెంట వైదికులు అర్చకస్వాములు పాల్గొన్నారు. శ్రీ వరాహలక్ష్మీ నార సింహస్వామి వారిని మంగళవారం నాడు శ్రీ త్రిదండి చినజీయరు స్వామివారు మరియు త్రిదండి అహోబిలం రామానుజ జీయరుస్వామి దర్శించుకున్నారు సింహగిరికిచేరుకున్న స్వామీజీలకు ఆలయ ఈ ఓ కె.రామచంద్రమోహన్ మరియు ఆలయ వైదికులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల, నడుమ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం బేడా ప్రదిక్షణం, కప్పస్థంబ ఆలింగనం, అనంతరం అంతరాలయంలో ప్రత్యేకర్చనలు చేశారు. అనంతరం లక్ష్మీఅమ్మవారు మరియు ఆళ్వారులదర్శనం అనంతరం ఆలయ వైదికులు స్వామీజీలకు స్వామివారి ప్రసాదములు అందజేశారు. అనంతరం ఆలయ వైదికులు మరియు ఈ ఓ తో పలు విషయములపై సలహాలు. సూచనలు చేశారు. స్వామిజివెంట ఆలయ అనువంశికధర్మకర్త పుసపాటి అశోకగజపతిరాజు దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు.



## నేడు రేణుక ఎల్లమ్మ అమ్మవారి తోలేళ్ల మహొత్సవం



డాబా గార్డెన్స్: కెప్టెన్ రామారావు జంక్షన్, అల్లిపురంలో వేంచేసి యున్న శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారి తోలేళ్ల, 19వ జాతర జాతర పరస మహొత్సవం నేడు, రేపు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ ప్రతి నిధులు వెంకట అప్పల నాయుడు, కర్రీ రాము, సుబ్బారావు, నీలకంఠం, బొడ్డు పోలా రావు, వాసుపల్లి నారాయణరావు, గనగళ్ల సత్యవతి, వాసుపల్లి నరసింగ రావు తదితరులు తెలిపారు. నేడు తోలేళ్ల సందర్భంగా దీప, ధూప, నైవేద్యాలతో పూల అలంకరణ, అమ్మవారికి కుంకుమార్చనలు జరుగుతుందన్నారు. సాంస్క ృతిక కార్యక్రమములు గొప్ప భజన, ఆర్కెస్ట్రాలు, నేల వేషాలు, తప్పెటగుళ్ళు, పులి వేషాలు, మిరుమిట్లు గొలిపే లైటింగ్ తదితరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఉత్సవాలకు పీలా వెంకట అప్పలనాయుడు, రాజేంద్ర, కర్రీ నీలకంఠం, లక్ష్మీ నారాయణ దంపతులు, ఎస్వీ సత్యనారాయణ, అల్లిపిల్లి అప్పారావు, అల్లిపిల్లి జగ్గారావు, నామగిరి శివకుమార్, బుకిరీ, యల్లజి తదితరులు ధన సహాయాన్ని అందించారన్నారు. భక్తులు అందరూ ఈ ఉత్సవాలలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా వారు కోరారు.

## *ఆడీ కారులో 300 బంగారు బిస్కెట్లు!*

### *ఉంగుటూరులో పట్టుకున్న పోలీసులు*

ఉంగుటూరు: పశ్చిమగోదావరి జిల్లా ఉంగుటూరులో భారీగా బంగారం పట్టుపడింది. కారులో తరలిస్తున్న బంగారు బిస్కెట్లను జాతీయ రహదారిపై ఉంగుటూరు పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విశాఖపట్నం నుంచి విజయవాడకు ఆడీ కారులో 30 కిలోల బంగారం (300 బంగారం బిస్కెట్లు) తరలిస్తున్నారు. పోలీసులకు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు ఉంగుటూరు టోల్ ప్లాజా వద్ద గణపవరం సీఐ రామ్‌కుమార్ నేతృత్వంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఏపీ31డీటీ 7777 ఆడీ కారులో 300 బంగారం బిస్కెట్లు ఉన్నట్టు గుర్తించారు. వాటి బరువు ఒక్కొక్కటి 100 గ్రాములు ఉన్నట్లు తెలిపారు. కారులో ప్రయాణిస్తున్న వారి వద్ద బంగారానికి సంబంధించిన బిల్లులు ఉండటంతో వాటిని సీఐతో పాటు తహశీల్దార్ జీవీఎస్ ప్రసాద్ పరిశీలించారు.

# మహిళలకు 'బంగారు' ఆఫర్లు

### జ్యువల్ వన్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ముత్తు కుమార్





విశాఖపట్నం : జ్యువల్ వన్ షోరూం ప్రపంచంలో ప్రసిద్ధి గాంచిన బంగారు ఆభరణాల తయారీ సంస్థ ఎమరాల్డ్ జ్యువలరీ వారి రిటైల్ షోరూం ఎక్స్‌క్లూజివ్ డిజైన్లు తయారు, అమ్మకం ఈ సంస్థ ప్రత్యేకత అని ఆ సంస్థ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ముత్తు కుమార్ పేర్కొన్నారు. దేశంలో ఏ జ్యూయలరీ సంస్థ తయారు చేయని విధంగా ఇప్పటి వరకూ 4.50 లక్షల కన్నా ఎక్కువ డిజైన్లు కలిగియు న్నదన్నారు.

అన్ని రకముల డిజైన్లు లభ్యమవుతాయని అన్నారు.

గోల్డెన్ స్టైల్ ప్రత్యేకంగా ఆకర్షణీయమైన ఆఫర్లు ప్రకటిస్తోందన్నారు. అన్ని రకాల ఆభరణాలపై 50 శాతం తగ్గింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళ లందరూ బంగారు నగలంటే ఇష్టపడతారని అంటూ గొలుసులు, చెవిదుద్దులు, నెక్‌లేస్‌లు అమ్మకాలపై ఆఫర్ ప్రకటిస్తున్నట్లు తెలిపారు.

మా సంస్థ వార్షికోత్సవ సంబరాలులో భాగంగా ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్నామని అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ముత్తు కుమార్ పేర్కొన్నారు.






Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com